తెలుగు రాష్ట్రాల సీఎంల సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల ప్రజలకు ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్‌మోహన్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల జీవితంలో నిత్యం కాంతులు విరజల్లేలా దేవతలు దీవించాలని తెలంగాణ సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. ప్రజలంతా సంతోషంగా సంక్రాంతి నిర్వహించుకోవాలని అన్నారు. (

పతీ ఇంటా సుఖశాంతులు, సౌభ్రాతృత్వం, సౌభాగ్యం వెల్లివిరియాలని కోరారు. సంస్కృతీ సంప్రదాయాలకు మనమిచ్చే గౌరవానికి సంక్రాంతి ప్రతీక అని ఏపీ సీఎం జగన్ అన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. గత 7 నెలల్లో రైతు సంక్షేమానికి చర్యలు తీసుకున్నామని చెబుతూ.. సంక్రాంతి పండగను ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 14-1-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 145 పేజీలు: 4 వెల: రూ.1/-

సీఎం కేసీఆర్ తో ఏపీ సీఎం వైఎస్ జగన్ భేటీ

హైదరాబాద్, జనవరి 13: ప్రగతిభవన్ లో ఇవాళ ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో సమావేశమయ్యారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. సీఎం కేసీఆర్ వెంట మంత్రి కేటీఆర్ ఉండగా..ఏపీ సీఎం జగన్ తో ఎంపీ విజయసాయిరెడ్డి ఉన్నారు. నదీజలాలు, విద్యుత్ ఉద్యోగులు తదితర విభజనకు సంబంధించిన అంశాలపై ఈ భేటీలో చర్చించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఏపీలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విభజన సమస్యలను పరిష్కరించుకొనేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు అప్పటి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ చొరవతో ఇరు రాష్ట్రాల సీఎంల భేటీకి అనువైన వాతావరణం ఏర్పడింది.

2019లో జరిగిన ఎట్‌హోం కార్యక్రమానికి ఇద్దరు సీఎంలు హాజరయ్యారు. వారితో గవర్నర్ ప్రాథమికంగా భేటీ అయిన సందర్భంగా ఇరు రాష్ట్రాల సీఎంలు విభజన సమస్యలు పరిష్కరించుకోవడానికి ముందుకొచ్చారు. ఖాళీగా ఉన్న సచివాలయ భవనాలను సీఎం కేసీఆర్ కోరిక మేరకు తెలంగాణకు ఇచ్చేందుకు ఏపీ సీఎం జగన్ సుముఖత వ్యక్తంచేశారు. ఆ వెంటనే సచివాలయ భవనాలను తెలంగాణకు అప్పగించారు. అనంతరం విభజన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2019 జూన్ 11వ తేదీన నాటి గవర్నర్‌కు ఏపీ సీఎం జగన్ లేఖరాశారు. స్పందించిన గవర్నర్.. విభజన సమస్యలను మంచి వాతావరణంలో పరిష్కరించుకోవాలని కోరు తూ 2019 జూన్ 12న ఇరురాష్ట్రాల సీఎంలకు లేఖ రాశారు.

కేంద్రం సంచలన నిర్ణయం..

– చంద్రబాబుకి ఎన్ఎస్‌జీ భద్రత తొలగింపు

– బాబుతో పాటు మరో 13మందికి తొలగించిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి13(ఆర్ఎన్ఎ) : కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. వీఐపీలకు రక్షణ కల్పించే బ్లాక్ క్యాట్ భద్రతను ఉపసహరించాలని నిర్ణయించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా 13మందికి సెక్యూరిటీని ఉపసంహరించనున్నారు. కేంద్ర హోంశాఖ వర్గాల సమాచారం మేరకు.. ఎన్ఎస్‌జీ ఇకపై కౌంటర్ టెర్రరిస్ట్, యాంటీ హైజాక్ వంటి తమ ప్రధాన విధులపై ఫోకస్ పెట్టనున్నాయట. అంతేకాదు కొంతమంది వీఐపీలకు ఎన్ఎస్‌జీతో భద్రత కల్పించడం కాస్త భారంగా కూడా మారిందట. అందుకే ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ వీఐపీలకు ఎన్ఎస్‌జీ సెక్యూరిటీని తొలగించి.. పారా మిలిటరీ దళాలతో భద్రతను కల్పించాలని భావిస్తున్నారట. ఎన్ఎస్‌జీ కమాండోలు కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్, యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్, శర్వానంద సోనోవాల్, మాయావతి, ఫరూక్ అబ్దుల్లా, అద్వానీ, ములాయం సింగ్ యాదవ్, ప్రకాశ్ సింగ్ బాదల్‌లు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి 25మంది బ్లాక్ క్యాట్ కమాండోలను కేటాయిస్తున్నారు. ఇప్పుడు వీరికి భద్రతను తగ్గిస్తే.. దాదాపు 450 మంది ఎన్ఎస్‌జీ కమాండోలు అందుబా టులోకి వస్తారు. వీరిని పరిస్థితిని బట్టి అత్యవసర సమయాల్లో భద్రత కోసం ఉపయోగించుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోం ది. అంతేకాదు ఎన్డీఏ సర్కార్ ఇటీవలే పలువురు వీఐపీలకు భద్రతను ఎస్పీజీ తగ్గించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్ఎస్‌జీని యాంటీ టెర్రరిస్ట్, యాంటీ హైజాక్ ఆపరేషన్ల కోసం 1984లో ఏర్పాటు చేశారు. తర్వాత ప్రముఖుల భద్రత కోసం కేటాయి ంచారు. కానీ వీఐపీల భద్ర త తమకు సంబ ంధం లేదని అధికారులు చెబు తున్నారట.. ఈ అదనపు బాధ్యతలు భారం గా మారా యనేది వారి వాదన. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో కమాండలో అవసరం ఉండట ంతో.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఫిలిప్పీన్స్‌లో పేలిన తాల్ అగ్నిపర్వతం

286 విమాన రాకపోకలపై ఆంక్షలు

మనీలా,జనవరి13(ఆర్ఎన్ఎ): ఫిలిప్పీన్స్ దేశంలోని తాల్ అగ్నిపర్వతం సోమవారం పేలింది. పేలుడుతో భారీగా లావా ప్రవహించింది. దీంతో 8వేల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు అధికారులు. అగ్నిపర్వతం పేలుడుతో వెదజల్లిన లావా, పొగతో ఫిలిప్పీన్స్ దేశంలో సోమవారం 286 విమానాల రాకపోకలను రద్దు చేశారు. అగ్నిపర్వతం పేలుడు కారణంగా వ్యవసాయ భూములు, భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మనీలా నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో లావా ప్రవహించ డంతో దుమ్ముధూళి వ్యాపించింది. దీంతో స్కూళ్లతో పాటు ప్రభుత్వ కార్యాలయాలను మూసివేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫిలిప్పీన్స్ దేశంలో తాల్ అగ్నిపర్వతం 1977లో పేలింది. అంతకు ముందు 1911వ సంవత్సరం జనవరిలో పేలడం వల్ల 1335 మంది మరణించారు. అగ్నిపరత్వం పేలుడు వల్ల వ్యవసాయ భూములు, భవనాలు దెబ్బతిన్నాయి.మనీలా నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో లావా వల్ల దుమ్ముధూళి వ్యాపించడంతో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేశారు. లావా వెదజల్లడం వల్ల దుమ్ము ధూళి వ్యాపించినందు వల్ల ప్రజలు డస్ట్ మాస్క్ లు ధరించి ఇళ్లలోపల ఉండాలని ఫిలిప్పీన్స్ అధికారులు కోరారు.

ఆందోళనకారులను చంపొద్దు

– ఇరాన్‌కు ట్రంప్ మరోసారి హెచ్చరికలు..!

వాషింగ్టన్, జనవరి13(ఆర్ఎన్ఎ) : ఇరాన్ ప్రభుత్వానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఉక్రెయిన్ విమానాన్ని పొరపాటున తామే కూల్చామని ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలో ఇరాన్‌లో ప్రజలు సొంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆందోళనకారులను చంపొద్దని ట్రంప్ ఇరాన్‌ని హెచ్చరించారు. అమెరికా విధించిన ఆంక్షలు, సొంత దేశంలో ఆందోళనలతో ఇరాన్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు తనకు సమాచారం ఉందని ట్రంప్ తెలిపారు. దీంతో ఇరాన్‌కు చర్చలకు రావాల్సిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పడ్డాయని అభిప్రాయపడ్డారు. చర్చలు జరపడానికి తాను సిద్ధంగానే ఉన్నానన్నారు. అయితే అణ్వస్త్ర నిషేధం, ఆందోళనకారులను చంపబోమని హామీ ఇస్తేనే అది సాధ్యమవుతుందని తెలిపారు. ఇక నిర్ణయం ఇరాన్ చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో ఘర్షణ వాతావరణ తలెత్తిన నాటి నుంచి అమెరికా ఆంక్షలు విధిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా జనరల్ సులేమానీ హత్యతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రతీకార దాడులకు పాల్పడంతో అమెరికా ఆంక్షల్ని మరింత కఠినతరం చేసింది. అలాగే ఇరు దేశాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తిన తరుణంలో పొరపాటున గతవారం ఇరాన్ ఉక్రెయిన్ విమానాన్ని కూల్చింది. దీంతో సొంత దేశానికి చెందిన 83మంది పౌరుల్ని కోల్పోయింది. దీంతో ప్రభుత్వ తీరుకు నిరసనగా దేశంలో అక్కడక్కడా ఆందోళనలు జరుగుతున్నట్లు సమాచారం.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.7,98,320 చెక్కు అందజేత

హైదరాబాద్, జనవరి 13: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ మునవర్ బైక్‌పై డ్యూటీకి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మునవర్ కుటుంబానికి రాచకొండ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ మహేశ్ భగవత్ రూ. 7,98,320 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మినిస్ట్రేషన్) శిల్పవల్లి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డి, జి. కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సొంత ప్రయోజనాల కోసమే..

– రాష్ట్రం కోసం భేటీ అవ్వడం లేదు

– ఇరు రాష్ట్రాల సీఎంల భేటీపై బీజేపీ నేత ప్రభాకర్

హైదరాబాద్, జనవరి13(ఆర్ఎన్ఎ) : ఏపీ సీఎం జగన్, తెలంగాణ సీఎం కేసీఆర్ లు రాష్ట్రం కోసం భేటీ అవ్వడం లేదని, సొంత ప్రయోజనాల కోసమే భేటీ అవుతున్నారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జగన్, కేసీఆర్‌ల భేటీ పై స్పందించిన ఎన్వీఎస్.. ఇద్దరు ముఖ్యమంత్రులు ఎందుకు భేటీ అవుతున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రయోజనాల కోసమే భేటీ అవుతుంటే.. జగన్ అక్రమాస్తుల కేసులో మంత్రిగా ఉన్న సబిత ఇంద్రారెడ్డి కేబినెట్ లో ఎలా కొనసాగుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ ఎక్కడ ఉందన్న మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. నిజామాబాద్ లో కవితను, కరీంనగర్ లో వినోద్ ను అడిగితే బీజేపీ ఎక్కడుందో చెప్తారని అన్నారు.

ఎన్నార్సీ ఆందోళనలపై కాంగ్రెస్ నేతృత్వంలో విపక్షాలు భేటీ

మమతా, మాయావతి, ఆప్ నేతలు గైర్హాజరు

న్యూఢిల్లీ,జనవరి13(ఆర్ఎన్ఎ): పౌరసత్వ చట్టం, ఎన్నార్సీపై ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కాంగ్రెస్ నేతృత్వంలో ప్రతిపక్ష పార్టీల నేతలు సోమవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. అయితే ఈ భేటీకి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు హాజరుకాలేదు. ప్రతిపక్షాల ఐక్యత చాటే ఉద్దేశంతో పిలుపునిచ్చిన ఈ సమావేశానికి కీలక నేతలు దూరంగా ఉండటం గమనార్హం.

ఇటీవల కార్మిక సంఘాలు చేపట్టిన బంద్‌లో తృణమూల్ కాంగ్రెస్, వామపక్ష కార్యకర్తల మధ్య ఉద్రిక్త ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణలపై అసహనంగా ఉన్న తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రతిపక్షాల సమావేశానికి తాను హాజరుకావట్లేదని స్పష్టం చేశారు. సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా ముందు నేనే ఉద్యమం ప్రారంభించాను. అయితే సీఏఏ-ఎన్నార్సీ పేరుతో కాంగ్రెస్, వామపక్షాలు ఉద్యమానికి బదులుగా విధ్వంసం సృష్టిస్తున్నాయి. వారి ద్వంద్వ సిద్ధాంతాలను మేం ఎప్పటికీ సహించబోం. విపక్ష భేటీకి హాజరయ్యే ప్రసక్తే లేదు' అని దీదీ గట్టిగా చెప్పారు.

బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి కూడా సమావేశానికి దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. గతేడాది సెప్టెంబరులో రాజస్థాన్‌లో బీఎస్పీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి రెండు పార్టీల మధ్య పొసగడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తాను కాంగ్రెస్ అధ్యక్షతన జరిగే సమావేశానికి హాజరైతే అది రాజస్థాన్‌లోని పార్టీ కార్యకర్తలను నిరుత్సాహపరుస్తుందని మాయావతి ట్విటర్ వేదికగా పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఈ సమావేశానికి హాజరుకావట్లేదు. భేటీ గురించి తమకు ఎలాంటి అధికారిక సమాచారం లేదని, అందుకే తాము దూరంగా ఉంటున్నామని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఎన్ఆర్సీకి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాటాలు చేయాలని నిర్ణయించారు.

భైంసాలో అర్ధరాత్రి అలజడి

రెండు వర్గాల మధ్య ఘర్షణ

ఇండ్లు, విహానాలకు నిప్పు

నిర్మల్,జనవరి13,(ఆర్ఎన్ఎ): భైంసా పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అలజడి రేగింది. రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఈఘటనలో వాహనాలు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. అల్లర్లు జరగకుండా పోలీసులు, జిల్లా యంత్రాంగం వెంటనే అప్రమత్తమయింది. నిర్మల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ భైంసాలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వివరాల్లోకి వెళితే, ఆదివారం పొద్దుపోయాక ఓ యువకుడు ద్విచక్రవాహనంపై స్పీడుగా వెళుతుండగా కొర్బా వీధిలో స్థానిక యువకులు అతడిని ఆపి మెల్లగా వెళ్లాల్సిందిగా సూచించారు. దీంతో ఆ యువకుడు తన వర్గానికి చెందిన సుమారు 500 మంది యువకులను వెంట తీసుకుని వచ్చి స్థానికంగా విధ్వంసం సృష్టించాడు. ఇళ్ల ముందు నిలిపిఉంచిన బైక్‌లు,ఆటోలకు నిప్పంటించారు. పలువురు ఇళ్లపై దాడి చేశారు. ఈఘటనలో 20మందికిపైగా గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే నిర్మల్ జిల్లా కలెక్టర్ ప్రశాంతి భైంసా చేరుకుని బాధిత కుటుంబాలతో మాట్లాడారు.

స్థానికులను ఘర్షణకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున సహాయం అందిస్తామని హామి ఇచ్చారు. ఘర్షణలో 16 ఇండ్లు, 23 ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. దాడిలో ఇరువర్గాలకు చెందిన వారితో పాటు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. మళ్లీ ఘర్షణలు తలెత్తకుండా ఎస్పీ శశిధర్ రాజు నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, పోలీసులను కలెక్టర్ పరామర్శించారు. ఘర్షణకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్ నెట్ సేవలు నిలిపివేశారు.

భైంసాలో అదపులో పరిస్థితి

ప్రత్యక్షంగా పర్యవేక్షించిన కలెక్టర్

భైంసా,జనవరి13(ఆర్ఎన్ఎ): నిర్మల్ జిల్లా భైంసాలో పరిస్థితి అదుపులో ఉంది. తాజాగా అక్కడ ఎస్పీ శశిధర్ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బదందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయన ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అలాగే కలెక్టర్ ప్రశాంతి కూడా అక్కడ పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఘర్షణకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు. నిర్మల్ జిల్లాలోని భైంసా పట్టణంలో రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి ఓ యువకుడు ద్విచక్రవాహనంపై స్పీడుగా వెళుతుండగా కొర్బా వీధిలో స్థానిక యువకులు అతడిని ఆపి మెల్లగా వెళ్లాల్సిందిగా సూచించారు. దీంతో ఆ యువకుడు తన వర్గానికి చెందిన సుమారు 500 మంది యువకులను వెంట తీసుకుని వచ్చి స్థానికంగా విధ్వంసం సృష్టించాడు. ఉదయం భైంసా చేరుకున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ ప్రశాంతి విచారణ చేపట్టారు. స్థానికులను ఘర్షణకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున సహాయం అందిస్తామని హామి ఇచ్చారు. ఘర్షణలో 16 ఇండ్లు, 23 ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. దాడిలో ఇరువర్గాలకు చెందిన వారితో పాటు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. మళ్లీ ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, పోలీసులను కలెక్టర్ పరామర్శించారు. ఘర్షణకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం అర్ధ రాత్రి అల్లర్లు చోటుచేసుకోవడంతో ఎస్పి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని అల్లర్లను అదుపులోకి తీసుకొచ్చారు. రెండు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణలో చోటుచేసుకోవడంతో స్థానిక సిఐ, ఎస్ఐ సిబ్బంది కలిసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘర్షణలో పలువరు పోలీసులు, ఇరువర్గాల యువకులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఎస్పి శశిధర్ రాజు ఘటనా స్థలానికి అల్లర్లను అదుపులోకి తీసుకొచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్ నెట్ సేవలు నిలిపివేశారు.

నిర్మల్ జిల్లా భైంసాలో అల్లర్ల నేపథ్యంలో అక్కడ పర్యటించిన కలెక్టర్ ప్రశాంతి

ఇరాక్ దాడిని ఖండించిన అమెరికా

వాషింగ్టన్, జనవరి13(ఆర్ఎన్ఎ): : ఇరాక్‌లో అమెరికా సైనికులు ఉన్న స్థావరాలపై ఆదివారం జరిగిన దాడిని అగ్రరాజ్యం తీవ్రంగా ఖండించింది. తాజా చర్య పట్ల అమెరికా విదేశాంగమంత్రి మైక్ పాంపియో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడి వెనక ఉన్న వారిని వీలైనంత త్వరగా పట్టుకోవాలని ఇరాక్ ప్రభుత్వాన్ని కోరారు. ఇరాక్ ప్రభుత్వానికి విధేయులుగా లేని కొంతమంది ఆ దేశ సార్వభౌమత్వంపై తరచూ దాడి చేస్తున్నారని.. దీనికి స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. పరోక్షంగా ఇరాక్‌లోని ప్రభుత్వ వ్యతిరేకులే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

పబ్‌లో అశ్లీల నృత్యాలు-పోలీసులు దాడి

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోని టాట్ పబ్‌పై పోలీసులు దాడులు నిర్వహించారు. అశ్లీల నృత్యాలు జరుగుతున్నాయనే సమాచారంతో ఆదివారం అర్ధరాత్రి పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పోలీసులతో పాటు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు సంయుక్తంగా ఏకకాలంలో దాడులు చేశారు. ఓ ప్రైవేటు సంస్థ ఈ పబ్‌లో ప్రత్యేకంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాడుల సమయంలో యువతీయువకులు ఉన్నప్పటికీ ఎలాంటి అశ్లీల నృత్యాలు కనిపించలేదని పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. అయితే కార్యక్రమానికి వచ్చిన వారి వివరాలను గుర్తింపు పత్రాలను సరిపోల్చి చూశారు. వీరిలో కొంతమంది యువతులను అదుపులోకి తీసుకుని ప్రైవేటు బస్సుల్లో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పార్టీలో మైనర్లు ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

చరిత్రలో నేటినిజం



కం॥ శోభితుడగుచు బుద్ధై చెలగుచు
ప్రాభవ మెసగ్పంగ చిత్ర రంగములోనన్
'శోభను' వెలుగొందె కమల
నాభుని దయతూ వినూత్న నక్షత్రమ్మై!!

-రాధశ్రీ
సెల్: 9494481210

(జనవరి 14 నటుడు 'శోభన్‌బాబు' పుట్టిన రోజు..)

'అన్నమే మనిషికి ప్రాణం'

నేటినిజం
మంగళవారం 14-1-2020

వేసవి తాపానికి తల్లడిల్లిన నేలతల్లి తొలకరికి పులకరిస్తుంది. మధురమైన మట్టి వాసనలు వెదజల్లుతుంది. 'ఒక్కజల్లు కురిసిందా, ఇక రెక్కలార్చుకున్నట్లే' అని సినారె చెప్పినట్లు పరిమళభరితమైన ఆవిర్లతో అవని ఆనందభరితమవుతుంది. పైరు సృష్టికి అదే ప్రాతిపదిక. 'బీటవారిన పచ్చని పంటకు ప్రాణం పోయాలని సమాయత్తమవుతంది. విత్తును మొక్కను చేయాలని ఆరాటపడుతుంది. 'అన్నమే మనిషికి ప్రాణం' అంది వేదం. భూమాత సకల జీవులకు ప్రాణదాత. మనిషి మూలాలు వెతకాలంటే– 'మట్టి లోతును ముట్టి చూడక మూలం ఎట్లా తెలుస్తుంది?' అని కవులు నిలదీశారు. కృష్ణుడు మన్ను తిన్నాడని యశోదమ్మకు కోపం వచ్చింది. 'మన్ను ఏటికి భక్షించెదవు? మన్నే ఏల? మరి పదార్థము లేదే?... మట్టి తప్ప మనింట్లో తినడానికి ఏం లేవా?' అని అడిగింది. వెంటనే కృష్ణుడు 'అమ్మా! మన్ను తినంగ నే శిశువునో ఆకొంటినో వెర్రినో' అని బుకాయించాడుగాని, మట్టి అంటే కృష్ణుడికి చాలా ఇష్టమని భాగవతం స్పష్టంగా చెబుతోంది. కాబట్టే ఆయన సత్యభామా సమేతుడై వచ్చి తనను వధించినపుడు 'ఇల్లాలుం కిటి (వరాహం)యైన కాలమున...' అని చెప్పుకొంటావుకదా, 'నిన్నుం తలంచి యైనను నన్నుం కృపన్ కావదే!' అంటూ నరకుడు తల్లిని దెప్పిపొడిచాడు– భాగవతంలో. భూదేవిపట్ల శ్రీకృష్ణుడికి గల ఆపేక్షకు వ్యాఖ్యాతలు మరో అందమైన సాక్ష్యాన్ని ప్రవేశపెట్టారు. బాల్యంలో కృష్ణుడు ఆటలాడుతూ మట్టినేలపై దొర్లి ఒంటినిండా దుమ్ము పులుముకొన్నాడు. 'తనువున అంటిన ధరణీ పరాగంబు పూసిన నెరిభూతి పూతకాగ...' దేహమంతటా విభూతి పూసుకొన్న పరమశివుడి మాదిరిగా పోతనకు దర్శనం ఇచ్చాడు కాని, 'ఆ పొర్లడం భార్యపై ప్రేమతో...' అన్నారు. భూదేవిని భారతదేశం దైవస్వరూపంగా విశ్వసించింది. అమ్మగా ఆరాధించింది. నీరు నింగి నిప్పు గాలి నేల... అంటూ పంచభూతాల్లో ఒకటిగా కొలిచింది. నేలనే నమ్ముకున్న రైతన్నలను భూమిపుత్రులుగా పిలిచింది. పరమ పావనమైన ఈ నేల అవతార మూర్తులకు జన్మనిచ్చింది. ప్రవక్తలను రూపొందించింది. వాల్మీకి వ్యాస కాళిదాసాది మహామహాకవులను ఈ జాతికి కానుక చేసింది. ఈ నేల, పవిత్రత విషయంలో నిశితమైన దర్భ... సంపద విషయంలో రత్నగర్భ! భగవంతుణ్ని ఉద్దేశించి విశ్వనాథ 'నీవే దైవము నేను భక్తుడను తండ్రీ నిన్ను ధ్యానించెదన్' అని ఊరుకోలేదు. 'నీవే భూమివి నేను కర్షకుడ తండ్రీ నిన్ను పండించెదన్' అన్నారు 'మాస్వామి'లో. తన స్తన్యాన్ని జీవుల నోటికి అందించడమే భూమికి సార్థక్యం. దానికోసం నేలతల్లి ఎదురుచూస్తుంది. 'పుడమి ఎదురు చూస్తోంది పథికుల తొక్కిడి కోసం... పొలం ఎదురుచూస్తోంది దుక్కి దున్నడం కోసం' అన్నారు కవులు. అది మాతృస్వభావం. పైరుకు జన్మనివ్వడం సృష్టి. దానికోసం సారాన్ని సంతరించుకోవడం, లేత కంకుల్లో తియ్యని పాలు నింపడం స్థితి. జీవుల మృతదేహాలతో సహా తిరిగి సమస్త వ్యర్థాలను తనలో లీనం చేసుకోవడం లయం. ఆ మూడింటినీ సక్రమంగా నిర్వహించడం భూమి లక్షణం. ఆమెను జగన్మాతగా 'పృథివీ సూక్తం' వర్ణించడంలోని రహస్యం అదే. అలాంటి పరమాద్భుత శాశ్వత స్వరూపాన్ని మనిషి తన సొత్తులా భావిస్తూ యజమానిలా వ్యవహరిస్తాడు. 'భూమి నాదియన్న భూమి ఫక్కున నవ్వు' అని వేమన యోగి పరిహసించింది– ఆ అవివేకాన్నే! 'ధారుణి రాజ్య సంపద మదంబున' మనిషి విర్రవీగినప్పుడూ భూమి అలాగే నవ్వుకుంటుంది. సహనానికి నేలతల్లి పెట్టింది పేరు. సహనశీలం గలవారిని భూదేవితో పోలుస్తారు. కుంతీదేవి గురించి చెబుతూ ద్రౌపది 'మాయత్త పృథ్వీసమాన' అంటుంది. తనపట్ల ఎంత అమర్యాదకరంగా ప్రవర్తించినా మనిషిని క్షమించడం భూమి సహజ లక్షణం. భర్తపట్ల అదే ఓరిమిని చూపించే భార్యను 'క్షమయా ధరిత్రీ' అన్నారు. అమెరికాలోని అరిజోనా విశ్వవిద్యాలయ పరిశోధకులు మట్టికి సంబంధించిన 'సరికొత్త' స్వభావాన్ని ఆవిష్కరించారు. 'మృత్తికాస్నానం' మట్టి ఔషధ విలువలు భారతీయులకు ఏనాడో తెలియడం దానికి కారణం.

తెలంగాణ పందెం కోళ్లతో భారీగా ఆదాయం

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): సంక్రాంతి బరిలో తెలంగాణ కోళ్లు హల్‌చల్ చేస్తున్నాయి. ఇక్కడి కోళ్లకు గిరాకీ ఉండడంతో కోళ్లను పెంచిన వారు దండిగా సంపాదిస్తున్నారు. నల్లగొండ,వరంగల్ తదితర ప్రాంతాల నుంచి పందెంకోళ్లను కొనుక్కుని పోతున్నారు. అనేక కుటుంబాల వారు సుమారు 30 ఏళ్ల నుంచి ఇక్కడ పందెం కోళ్లను పెంచుతున్నారు. గతంలో స్థానికులు ఇక్కడ పందేలు ఆడేవారని, పోలీసుల దాడులు పెరగడంతోపాటు ఆర్థికంగా నష్టపోతుండడంతో వాటిని పక్కనపెట్టేశారు. ఒక్కో కోడి రూ.2,500 నుంచి రూ.10వేల వరకు ధర పలుకుతుందని పెంపకందారులు చెబుతున్నారు. వీటిల్లో పెట్టమర, నెమలి, కాకి డేగ, డేగ, రసంగి, పింగళి, పర్ల, పచ్చకాకి వంటి అనేక రకాల పందెం కోళ్లు ఉండగా ఇందులో ఎక్కువగా కాకి డేగ, పెట్టమర, రసంగి, పచ్చకాకి రకాలను మాత్రమే ఇక్కడ పెంచుతున్నారు. రంగు, రకం, బరువును బట్టి ధర పలుకుతుంది. వీటి పెంపకానికి పెట్టుబడి భారీగానే ఉంటుంది. రాగులు, సద్దలు, బాదం పలుకులు, కోడి గుడ్లు ఇలా మొత్తం ఒక్కో కోడికి ఏడాదికి రూ.రెండు వేలకు పైగానే ఖర్చు పెడతామని పెంపకందారులు చెబుతున్నారు. ఇలా బలవర్ధకమైన ఆహారంతో ఏడాదిలో 3 నుంచి 4 కిలోల బరువు వచ్చేలా చూస్తారు. బరువు ఇంతకు తక్కువైనా, ఎక్కువైనా అవి పందేలకు పనికిరావు. కొన్ని కోళ్లు పెరిగిన తర్వాత రోగాల బారిన పడి చనిపోతాయి. కోళ్ల పెంపకం ఇక్కడి వారికి ఉపాధిగా మారింది. చెరుకు కొట్టే పనులకు ఆంధ్రా ప్రాంతానికి వెళ్లిన ఇక్కడి కూలీలు పందెం కోళ్లను గ్రామానికి తెచ్చుకున్నారు. వలసకు వెళ్లగా ఇంటి వద్ద ఉన్న వారు ఈ కోళ్ల పెంపకాన్ని వ్యాపకంగా చేసుకొని దీనిని వ్యాపారంగా చేసుకుని డబ్బులు సంపాదించుకుంటారు. సంక్రాంతి సందర్భంగా ఏటా ఈ గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో పందెం కోళ్లు ఆంధ్రా ప్రాంతానికి తరలుతాయి. ఒక్క పండుగ రోజుల్లోనే కాకుండా ఇతర పండుగలు, సాధారణ రోజుల్లోనూ ఆంధ్రా నుంచే పందెం రాయుళ్లు వచ్చి ఇక్కడి కోళ్లను కొనుగోలు చేస్తారు. ఒక్కో పందెం కోడి పెట్ట ఏడాదికి నాలుగు ఈతలలో అనేక గుడ్లు పెట్టినా.. అందులో 20 నుంచి 30 గుడ్లు పిల్లలుగా మారుతున్నాయి. వాటిని తిరిగి పొదిగిస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): భవన నిర్మాణ రంగం కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు.తెలంగాణ రాష్ట్రం లో 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు 18 రకాల విభాగాల్లో పని చేస్తున్నారని తెలిపారు. అందులో 8 లక్షల మంది కార్మికుల పేర్లు మాత్రమే సంక్షేమ బోర్డులో నమోదై ఉన్నాయని చెప్పారు. మరికొంత మంది వలసలు పోతు న్నారన్నారన్నారు. అడ్డాల ఏర్పాటు, ఆయా ప్రాంతాల్లో మౌ లిక వసతులు కల్పించాల్సిన లేబర్ శాఖ అధికారులు చోద్యం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికు లకు గుర్తింపు కార్డులివ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పెట్టుబడిదారులు, బడా వ్యాపారులకు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం కార్మికులకు మాత్రం కూలి పెంపు, రుణాలివ్వడం లేదన్నారు.

ఇసుక పాలసీపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇసుక దొరక్క పనులు లేక భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల పోషణ భారమై అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో సెస్ ద్వారా సంక్షేమ బోర్డులో ఉన్న నిధులు కార్మి కుల సంక్షేమానికి ఖర్చు చేయకుండా ఇతర రంగాలకు మళ్లించడం సరికాదన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి: తమ్మినేని

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): అనేక సమస్యలు గ్రామాల్లో కొట్టుమిట్టాడుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఇటీవలి కాలంలో అనేక సమస్యలు ఉన్నా వాటిని సిఎం కెసిఆర్ పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత సమస్యలుండవని చెప్పిన సిఎం కెసిఆర్ ప్రజల సమస్యల విషయంలో ఎలాంటి చొరవ తీసుకోవడం లేదన్నారు. ప్రజలకు అన్యాయం జరిగే చోట ప్రజలను చైతన్యవంతులుగా చేసేందుకు సీపీఎం సిద్ధంగా ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను విస్మరించి, ప్రజలతో ఓట్లు వేయించుకొని పోలీసులను గుప్పిట్లో పెట్టుకొని ప్రభుత్వ పాలన కొనసాగిస్తున్నారన్నారు. రైతుల సమస్యల్లో పోలీసులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని ప్రశ్నించారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించి నిరంతరంగా సాగునీటినందించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో అనేక ప్రాజెక్టులను పునరాకృతి చేపట్టి వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. భూములు కోల్పోయిన రైతులకు భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలన్నారు. అవసరం లేనిచోట వేలకోట్లతో రిజర్వాయర్‌లు నిర్మిస్తున్నారన్నారు.

అంచనాలు పెంచి రాజకీయ నాయకులు, గుత్తేదారులు తమ జేబులు నింపుకొంటున్నారని తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు రైతులకు ఉపయోగపడేలా జరగాలన్నారు.కేవలం సీట్లు తమకుంటే చాలు అన్నట్లు ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు.

మున్సిపల్ ఎన్నికలపై అధికారుల నజర్

మద్యం,డబ్బు ప్రవాహం లేకుండా ప్రత్యేక బృందాలు

కామారెడ్డి,జనవరి 13(ఆర్ఎన్ఎ): పురపాలిక ఎన్నికల్లో నిఘాను కట్టుదిట్టంచేశారు. ప్రలోభాలకు గురిచేయకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మూడు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు ఒక ఎస్ఎస్ బృందా న్ని తనిఖీల కోసం ఏర్పాటు చేశారు. ఓటర్లను మద్యం, డబ్బులు ప్రభావితం చేయకుండా ఉండేందుకు అడుగడుగునా తనిఖీలు ప్రారంభించారు. నామినేషన్లు వేయడం పూర్తి కావడంతో అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు.మున్సిపాలిటీలకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే దారుల్లో ఎస్ఎస్‌టీలను ఏర్పాటు చేసి అనుక్షణం తనిఖీ లు చేస్తున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో తహసీల్దార్‌తో పాటు ఏఎస్సై స్థాయి అధికారి ఇద్దరు పోలీసులు మరో వీడియోగ్రాఫర్ ఉంటున్నారు. ప్రతి తనిఖీని వీడియో తీయడం ద్వారా పారదర్శకతను పాటిస్తున్నారు.దీనికి తోడు మున్సిపాలిటీలోకి ప్రవేశించే ప్రధాన రహదారుల్లో ఎస్ఎస్ బృందాలను ఏర్పాటు చేసి అన్ని రకాల వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో పురు పోరులో అక్రమాలను నియంత్రించడానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, మరో మూడు ఎస్ఎస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడలో ఈ బృందాలు విస్తృతంగా పర్యటించి అనుమానాస్పదంగా ఉన్న వారిని తనిఖీ చేస్తున్నాయి. ఆయా వార్డుల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఈ బృందాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. వీటితో పాటు స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు మూడు పురపాలక సంఘాల్లో ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాయి. కామారెడ్డిలోని నిజాంసాగర్ రహదారి, నిజామాబాద్ రహదారి, సిరిసిల్ల రహదారి, హైదరాబాద్ రహదారులపై ప్రత్యేకంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు తనిఖీలు చేస్తున్నారు. ఎల్లారెడ్డిలో మెదక్ రహదారి, నిజాం సాగర్ రహదారి, కామారెడ్డి రహదారుల్లో తనిఖీలు చేస్తున్నారు.

వ్యవసాయ ప్రధాన పండగ

హైదరాబాద్, జనవరి 13: వ్యవసాయంతో ముడిపడిన నాలుగు రోజుల పండుగ సంక్రాంతి. పాడిపంటలకు, మనుషులకు ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుంది. పంటలు చేతికొచ్చిన వేళ.. ప్రతి పల్లె మురిసిపోతుంది. ఇళ్ల ముందు రంగవల్లులు, ఇంటి లోపల పిండివంటలు, ఆకాశంలో గాలిపటాలు, బసవన్నల ఆటలు, హరిదాసుల పాటలు.. సంక్రాంతి సంరంభం అంతాఇంతా కాదు. సంక్రాంతి సంబరం నాలుగు రోజుల పాటు కొనసాగుతుంది. తొలిరోజు భోగి, రెండో రోజు మకర సంక్రాంతి, మూడో రోజు కనుమ, నాలుగో రోజు ముక్కనుమ గా జరుపుకుంటారు. మొదటి రోజున భోగి. శ్రీ రంగనాథుడు గోదాదేవిని వివాహం చేసుకుని భోగభాగ్యాలు ప్రసాదించినందున 'భోగి' ఏర్పడిందనేది ప్రసిద్ధం. భోగి నాడు తెల్లవారుజామునే భోగిపిడకలతో మంటలు వేసి.. ఇంట్లోని పనికిరాని సామాన్లు ఆ మంటలో వేస్తారు. పాతపీడలు తొలగిపోయి నూతన త్వానికి స్వాగతం పలకడం ఇందులోని అంతరార్థం. అదేరోజు సాయంత్రం పిల్లలకు భోగి పండ్లు పోస్తారు. విష్ణుమూర్తికి ప్రీతికరమైన రేగుపళ్లను తలపై నుంచి పోయడం ద్వారా చిన్నారులకు శ్రీమన్నారాయణుడి అనుగ్రహం లభిస్తుందని విశ్వసిస్తారు. సంక్రాంతి పండుగ రైతన్నకు సంబంధించిన దిగా గుర్తించాలి. సత్యనిష్ట మానవ ధర్మంగా ఉండాలి. మానవులు తమ ధర్మం ఆచరించాలని ఆర్షవాక్కు. ఎలాంటి వాయిదాలకూ ఆస్కారం ఇవ్వకుండా దైవ, ధర్మకార్యాలు ఆచరించాలి. రెండో రోజు సంక్రాంతి. ప్రతి లోగిలి ధాన్యరాసులతో తులతూగాలని కోరుకునే పండుగ ఇది. కొన్ని ప్రాంతాల్లో గౌరీదేవిని పూజించి పసుపు, కుంకుమలు ముత్తైదువులకు ఇచ్చే సంప్రదాయం ఉంది. ఈ రోజున ప్రతి లోగిలి ముగ్గులతో కళకళలాడుతుంది. తమ ఇంట్లో పాడిపంటలు సమృద్ధిగా కొలువుదీరాలని కోరుతూ పాలు పొంగిస్తుంటారు. ఇంటి లోపల ప్రధాన ద్వారానికి ఎదుట ఆవు పిడకలు పేర్చి.. వాటిపై మట్టి పాత్రలో పాలు తీసుకుని ఉంచుతారు. పాలు పొంగిన తర్వాత.. ఆ పాలతో పాయసం చేసుకుని భగవంతునికి నివేదన చేస్తారు. మూడో రోజైన కనుమ కర్షకుల పండుగ. పశువుల కొట్టాలను శుభ్రం చేస్తారు. పశువుల ను అందంగా అలంకరించి పూజిస్తారు. పశువుల పాకలోనే పొంగలి వండి భగవంతుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం ఆ పొంగలిని పొలాల్లో చల్లుతారు. ఇలా చేస్తే.. పంటలు బాగా పండుతాయని నమ్ముతారు. కనుమ మర్నాడు ముక్కనుమ జరుపుకుంటారు. ఈ రోజున కొత్తగా పెళ్లి అయిన మహిళలు 'సావిత్రి గౌరి వ్రతం ఆచరిస్తారు. అంటే బొమ్మల నోము పడతారు. ముక్కనుమ నాడు సావిత్రి గౌరి వ్రతం ఆచరించే మహిళలకు సౌభాగ్యం కలుగుతుందని విశ్వసిస్తారు. ఉత్తరాయణ పుణ్య కాలం మొదలయ్యేది సంక్రాంతి నుంచే...సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడంతోనే మకర సంక్రాంతి అంటారు. ఇక్కడి నుంచే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశిస్తుంది. సరతి చరతీతి సూర్యః' అనగా సంచరించువాడు సూర్యుడు అనిఅర్థం. భాస్కరుని సంచారం రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి ఉత్తరాయణం, రెండోది దక్షిణాయణం. మనకు ఒక సంవత్సరకాలం దేవతలకు ఒక్క రోజు. 'ఆయనే దక్షిణెళి రాత్రిః ఉత్తరేతు దివా భవేత' అంటే ఆరుమాసాల ఉత్తరాయణ కాలం దేవతలకు పగలు. దక్షిణాయణం రాత్రి. అంటే ఉత్తరాయణంలో దేవతలు సంచరిస్తారని ప్రతీతి. పగటి వేళ అయిన ఉత్తరాయణంలో దైవీశక్తులు మేల్కొని ఉంటాయి. పుణ్యకార్యాలు, దానధర్మాలకు అనువైన కాలమిది. భీష్మాచార్యులు కురుక్షేత్ర సంగ్రామంలో కుప్పకూలినా స్వచ్ఛంద మరణ వర ప్రభావంతో ఉత్తరాయణం వచ్చే వరకు ఊపిరి విడువలేదు. ఆయన కన్నుమూయడానికి ముందు ధర్మరాజుకు విష్ణుసహస్రనామాలు ఉపదేశించాడు. ధార్మిక చింతనకు ఉత్తరాయణం పుణ్యప్రదం అని చెప్పడానికి ఇది ఒక నిదర్శనం. పితృకార్యాలకూ ఉత్తరాయణం విశేషమైనది. ఈ కాలంలో మరణించిన వారికి పరమపదం కలుగుతుందని భీష్మాచారుల వారు చెప్పారు. నక్షత్రాలు ఇరవై ఏడు. ఒక్కో నక్షత్రానికి నాలుగు పాదాలు. తొమ్మిది పాదాలకు ఓ రాశి. అలా పన్నెండు రాశులు 108 పాదాలలో విస్తరించి ఉంటాయి. ఈ రాశుల గుండా సూర్యుని ప్రయాణం సాగుతుంది. సూర్యుడు ఒకరాశి నుంచి మరొక రాశికి మారడాన్ని సంక్రమణం అంటారు. ఇలా ఏడాదికి పన్నెండు సంక్రమణాలు వస్తాయి. వీటిలో మకర సంక్రమణం ఉత్కృష్టమైనది. మకర సంక్రమణంతో సూర్యుని గమనం ఉత్తర దిశగా సాగుతుంది. ఉత్తర దిక్కు మోక్షాన్ని సూచిస్తుంది. అందుచేతనే ఉత్తరాయణ పుణ్యకాలం మోక్ష సాధనకు అనువైనదంటారు పెద్దలు. మకర సంక్రమణం తర్వాత వాతావరణంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తాయి. అప్పటి వరకు వణికించిన చలి మెల్లగా తగ్గుముఖం పడుతుంది. సమశీతోష్ణస్థితి నెలకొంటుంది. ఇన్ని విశేషాలున్న ఉత్తరాయణంలో తెలుగువారికి అత్యంత ప్రియమైన సంక్రాంతి పండుగ మరో ప్రత్యేక ఆకర్షణ. ఈ పర్వదినం ఆచరణలో, తినే పదార్థాల వెనుక వైజ్ఞానికమైన ప్రాముఖ్యం కూడా ఉంది. ఈ కాలంలో శరీరానికి తగినంత వేడి, కొవ్వు అవసరం అవుతాయి. అందుకే నువ్వులు, బెల్లం,పిండివంటలు ఆరగిస్తారు. వీటి ద్వారా చలికాలంలో శారీరంలో కలిగిన మార్పులు సర్దుకుంటాయని గ్రహించి వీటన్నింటిని ఆచార రూపంలోకి తీసుకుని వచ్చారు. మన సంస్కృతిలో ప్రతి పండుగ సారాంశం ఇతరుల మేలు కోరడమే. పంటలు ఇళ్లకు చేరే కాలంలో వచ్చే సంక్రాంతి కూడా అలాంటిదే. రైతులు తమ పొలంలో పని చేసిన కూలీలకు, అవసరార్థులకు తోచినంత ధాన్యం ఆత్మీయంగా దానం చేస్తారు. ఈ సమయంలోనే ఊరూరా తిరిగే హరిదాసులు, గంగిరెద్దులవాళ్లు, బుడబుక్కలవాళ్లకూ ఎంతో కొంత సమర్పించుకుంటారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న సంక్రాంతితో మొదలయ్యే ఉత్తరాయణ పుణ్యకాలం సమస్త మానవాళికి పుణ్యప్రదం.

యధావిధిగా జాతీయ రహదారిపై రద్దీ

టోల్‌గేట్ వద్ద తప్పని నిరీక్షణలు
సరిపడా రవాణా వ్యవస్థ లేక అవస్థలు

నల్గొండ,జనవరి13(ఆర్ఎన్ఎ): సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరవాసులు గ్రామాల బాట పట్టారు. సంక్రాంతిని సొంతూళ్లలో జరుపుకునేందుకు సొంతవాహనాల్లో బయలుదేరారు. స్కూళ్లకు సెలవులు ప్రకటించడంతో అంతా గ్రామాలబాట పట్టారు. దీంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. విజయవాడ వైపు వెళ్లే వాహనాల కారణంగా పతంగి టోల్‌గేట్ వద్ద రద్దీ నెలకొంది. సంక్రాంతి సెలవులు రావడంతో ఊళ్లకు వెళ్లే వారితో వాహనాల రద్దీ పెరిగింది. ఇకపోతేసంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. శుక్రవారం నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో రద్దీ మరింత పెరిగింది. తెలంగాణ జిల్లాలకు , ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు టీఎస్ ఆర్టీసీ పేర్కొంది. డిమాండ్‌కు తగిన విధంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీగా వాహనాల రద్దీ నెలకొంది. దీంతో పెద్దఎత్తున ట్రాఫిక్ జాం అయింది. నేషనల్ హైవేపై పంతంగి గ్రామం వద్ద టోల్ ప్లాజాను ఏర్పాటుచేశారు. దీంతో కిలోమీటర్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆంధ్రా ప్రాంత వాసులు మొత్తం ఈ టోల్‌గేట్ మీదుగానే వెళ్లాలి. దీంతో రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. శుక్రవారం నుంచి సంక్రాంతి పండుగ సెలవులు ఇవ్వడం, శనివారం రెండో శనివారం సెలవు కావడంతో ఇక పండుగకు సొంత ఊళ్ళకు పెద్దఎత్తున సొంత వాహనాల్లో తరలివెళుతున్నారు. దీంతో టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ జాం అయింది.

వాహనాలు బారులు తీరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గంటలతరబడి ఇక్కడే నిలవాల్సిరావడంతో అసహనం వ్యక్తం చేశారు. నిర్వాహకులు సరిగా వ్యవహరించడం లేదన్నారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన అయితే జనసంద్రమవుతోంది. బెర్త్ రిజర్వేషనలు ఎప్పుడో రిగ్రేట్‌కు చేరుకున్నాయి. దీంతో జనరల్ బోగీలోకి వెళ్లేందుకు ప్రయాణికులు సర్కస్ ఫీట్లు చేస్తున్నారు.

ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్ల నుంచి ప్రత్యేక బస్సులు జిల్లాలకు వెళ్లినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. రద్దీ నేపథ్యంలో మరిన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటునట్లు అధికారులు తెలిపారు.

కోటి ఎకరాల మాగాణమే తెలంగాణ లక్ష్యం

కాళేశ్వరంతో మారుతున్న దశ
కేసీఆర్ నిరంతర శ్రమతో వ్యవసాయానికి ఊతం: వేముల

నిజామాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): తెలంగాణ వ్యాప్తంగా కోటి ఎకరాల బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కోటి ఎకరాల మాగాణి తెలంగాణ లక్ష్యంగా సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. పట్టణాల్లో కూడా అనేక పథకాలతో పేదల సంక్షేమంకొనసాగుతోందన్నారు. పట్టణాలు బాగా అభివృద్ధిలోకి రావాలంటే పురపాలికల్లో టిఆర్ఎస్ గెలవాలన్నారు. రెబల్స్ అంతా వెనక్కి తగ్గుతున్నారని, టిఆర్ఎస్ గెలుపు ఖాయమని అన్నారు. అనేక పథకాలతో తెలంగాణ పురోగతిలో ఉందన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్తు అందిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకున్నామని అన్నారు. రూ. 13,500 కోట్ల వ్యయంతో కాళేశ్వర్ నీటిని తెస్తున్నామన్నారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి మీదుగా మిడ్ మానేరుకు నీరు వస్తుందని, అక్కడి నుంచి మల్లన్నసాగర్ వరకు నీరు తేవడానికి పనులు కొనసాగుతు న్నాయన్నారు. మిడ్ మానేరు నుంచి మల్లన్నసాగర్ 42 కి.మీ.ల దూరం ఉండగా అందులో 33 కి.మీ.ల దూరాన్ని రూ. 10 వేల కోట్లు వెచ్చించి సొరంగం తవ్వకం చేపడుతున్నామన్నారు. మల్లన్నసాగర్ నుంచి నల్గొండ, నిజాంసాగర్, కామారెడ్డి ప్రాంతాలకు సాగునీటిని అందిస్తామన్నారు. రూ. 40 వేల కోట్లతో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగు నీరు సరఫరా చేస్తామన్నారు. విద్యుత్ ఉత్పాదనరంగంలో చేపట్టిన అన్ని ప్రాజెక్టులను అనుకున్న సమయానికి పూర్తి చేస్తామని అన్నారు. పాల్వంచలోని కేటీపీఎస్ ఏడోదశ విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఉత్పత్తి జరగనుందని చెప్పారు.

సీఎం కేసీఆర్ ఆశించిన విధంగా తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడేళ్లలో 25 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించి మిగులు విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంగా మార్చాలనే సంకల్పంతో కృషిచేస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, సీఎం కేసీఆర్ నిర్దేశించిన విధంగా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, కొత్త ప్రాజెక్టుల రూపకల్పన వేగంగా జరుగుతోందన్నారు. గృహ, పారిశ్రామిక, వ్యవసాయ వినియోగదారులకు కరెంటు సమస్యలు ఉత్పన్నం కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా అనేక సమస్యలు ఉన్నప్పటికీ విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేశామన్నారు. సీఎం కేసీఆర్ స్వీయ పర్యవేక్షణ వల్ల కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్, సింగరేణి జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లు త్వరిత గతిన పూర్తి చేసుకొని ఉత్పత్తి చేసుకోగలిగామని అన్నారు. రైతులకు కూడా 24గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్నదే సీఎం కేసీఆర్ ఏకైక లక్ష్యమన్నారు. ఈ విషయంపై ప్రతిపక్షాలు చేస్తోన్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. వాస్తవ అభివృద్ధిని చూడాలన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రూ.2500 కోట్లతో డిస్ట్రిబ్యూషన్, హెచ్‌టీ లైన్స్, సబ్ స్టేషన్లను నిర్మించి విద్యుత్ సరఫరాలో అవాంతరాలను తొలగించామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టారని, దీని వల్ల రైతులు, అన్ని వర్గాల వినియోగదారులు సంతోషంగా ఉన్నారన్నారు.

రైళ్లలో నిలబడే చోటు కూడా కరువే

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): కర్నూల్ వైపు వెళ్లే రైళ్లలో రద్దీతో ప్రయాణికుల నానాయాతన పడుతున్నారు. ఓ వైపు అయ్యప్ప భక్తులు మరోవైపు సంక్రాంతి రద్దీతో నిబడడానికి కూడా చోటు లేకుండా ప్రయాణికులు పరుగులు తీస్తున్నారు. రైలెక్కితే చాలన్న రీతిలో ప్రయాణికులు వెళుతున్నారు. ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు రైళ్లలో నిలబడి ప్రయాణిస్తుం డగా.. ప్యాసింజర్ రైళ్లలో నిలబడటానికి కూడా చోటు ఉండటం లేదు. కాచిగూడ నుంచి చిత్తూరు, బెంగళూరు, యశ్వంత్‌పూర్, తిరుపతి, కర్నూలు, గుంటూరు, గుంతకల్ ఇలా ప్రతి రైళ్లొనూ ప్రయాణికుల రద్దీ తీవ్రంగా ఉంది. బస్సుల్లో ఏకంగా ప్రత్యేక ఛార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు రైళ్లను ఆశ్రయిస్తున్నారు. రైళ్లకు సంక్రాంతి రద్దీ పెరగడంతో హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్లే రైళ్లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడు తున్నాయి. హైదరాబాద్ నగరంలో స్థిపర పడినవారు, వివిధ పనులపై వచ్చిన వారు సొంతూళ్లకు వెళ్తున్నారు. దీంతో మహబూబ్‌నగర్ రైల్వే స్టేషను మీదుగా వెళ్లే ప్రతి రైలుకు రెండు రోజులుగా రద్దీ పెరిగింది. గుంటూరు, కర్నూలు టౌన్, చెన్నైఎగ్మూర్ రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిశాయి.

జనగామ పీఠంపై టీఆర్ఎస్ గురి

నేటితో ముగియనున్న ఉపసంహరణలు
రెబల్స్ లేకుండా అధికార పార్టీ జాగ్రత్తలు

జనగామ,జనవరి13(ఆర్ఎన్ఎ): జనగామలోని వార్డులన్నీ క్లీన్ స్వీప్ చేసి మున్సిపల్‌పై గులాబీ జెండా ఎగరవేయాలనే లక్ష్యంతో టీఆర్ఎస్ వ్యూహ రచన చేస్తున్నది. ఇప్పటికే గెలుపు తమదేనన్న ధీమాతో టీఆర్ఎస్ ముఖ్య వర్గాలు ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డిలు ఎవరికి వారు వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గులాబీ పార్టీ ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నది. నామినేషన్ల పర్వం ముగిసిన నేపథ్యంలో టీఆర్ఎస్ అభ్యర్థిత్వానికి తీవ్ర పోటీ నెలకొంది. దీంతో రెబల్సం తెరపైకి రాకుండా పార్టీ శ్రేణులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. 14వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉండడంతో పోటీదారుల మధ్య సయోధ్య కుదిర్చేందుకు పార్టీ శ్రేణులు చర్యలు చేపట్టారు. మరోవైపు జనగామపై గులాబీ జెండా ఎగరడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి.. ప్రతి ఓటరును కలిసి ఓటు అడిగేలా నాయకులు వార్డుల వారీగా ఇన్‌చార్జీలకు బాధ్యతలు అప్పగించనున్నారు.

నాలుగైదు వార్డులు కలిపి ఓ ముఖ్య కూడలి వద్ద సభను ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు. ఏయే సమయాల్లో ఎక్కడెక్కడ నిర్వహించాలో నిర్ణయించుకుంటారు. కచ్చితంగా గెలుస్తామనే వార్డులో ప్రచారంలో లోటు ఉండకుండా ఇప్పటి నుంచే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బీ–ఫారాలు సమర్పించిన తర్వాత పార్టీ జెండాతో వీధుల్లో ప్రచారం చేయనున్నారు. అప్పటి వరకు టికెట్ కచ్చితంగా వస్తుందని సంకేతాలు అందిన వారు పార్టీ జెండాలు లేకుండా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. వార్డులోని తమ బంధువులు, మిత్రులు, యూత్ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు, వార్డు ముఖ్యులను కలుస్తూ ముందుకెళ్తున్నారు. ఇక 14వ తేదీ తర్వాత అధికారికంగా ప్రచార పర్వాన్ని హోరెత్తించనున్నారు. సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం వంటి వాటిని వినియోగించుకోనున్నారు. టీఆర్ఎస్ చేపట్టిన, చేపట్టబోయే కార్యక్రమాలను తక్కువ నిడివి గల వీడియోలను ప్రజలకు చేరవేయనున్నారు. ఈ వీడియోల్లో ఆయా వార్డుల అభ్యర్థుల వివరాలు ఉంటాయి. ప్రతి వార్డులో టీఆర్ఎస్ పరిశీలకుడు ఉంటాడు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో ముఖ్య నేతలతో సమాలోచనలు జరిపి ఓ నిర్ణయానికి వస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తుది నిర్ణయాన్ని తీసుకుంటూ ముందుకెళ్లనున్నారు. టీఆర్ఎస్‌లో రెబల్స్ బెడద ఉండకపోవచ్చని పార్టీ సీనియర్ నేతలు భావిస్తున్నారు. వివిధ వార్డుల నుంచి టీఆర్ఎస్ టికెట్ ఆశించి నామినేషన్లు దాఖలు చేశారు. అత్యధికంగా 1వ వార్డు నుంచి దాఖలయాయి. అయితే, ఒక్కరికే బీ–ఫారం దక్కనుంది. బీ–ఫారం దక్కించుకున్న వారు మినహా.. మిగతా వారంతా నామినేషన్లు ఉపసంహరించు కోనున్నారు. పార్టీ ముఖ్యులు మాట్లాడి నామినేషన్ వేసిన వారి మధ్య సయోధ్య కుదురుస్తున్నారు. దాదాపు ఇప్పటికే చాలా వార్డుల్లో నామినేషన్లు ఉపసంహరించుకుని పార్టీ అభివృద్ధికి, అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బరిలో నిలిచే వారి తుది జాబితా విడుదలయ్యాక వార్డులన్నీ క్లీన్‌స్వీప్ చేయడంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించనుంది.

పట్టణాల్లో గెలుపే లక్ష్యంగా టీఆర్ఎస్ వ్యూహం

అభివృద్ధి కార్యక్రమాలు గడపగడపకు తీసుకుని వెళ్లేలా ప్రచారం

కామారెడ్డి,జనవరి 13(ఆర్ఎన్ఎ): పురపాలికల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని టిఆర్ఎస్ నిర్ణయించింది. అలాగే మరింత అభిశృద్ధి ఎలా చేయబోతున్నదీ విస్తామని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు నేతలు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మూడు మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన నేతలతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలపై చర్చించారు. పట్టణాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని, ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారని అన్నారు. ప్రతి మండలం నుంచి పది మంది కార్యకర్తలు ప్రచారంలో పాల్గొనాలన్నారు. అన్ని వార్డుల్లో టీఆర్ఎస్ జెండా ఎగురవేసేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు.

ఇదిలావుంటే మున్సిపల్ ఎన్నికల వేళ ఆర్మూర్‌లో బీజేపీకి గట్టి షాక్ తగిలింది. ఆర్మూర్ పట్టణ బీజేపీ కార్యదర్శి పూజ నరేందర్ బీజేపీ వీడి కారెక్కారు. 25 ఏండ్లుగా బీజేపీ అభివృద్ధికి ఆయన పాటు పడుతున్నారు. ఇటీవల కమలం పార్టీకి గుడ్‌బై చెప్పి ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఆర్ఎస్‌లో చేరారు. పూజ నరేందర్‌కు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి గులాబీ కుండువా కప్పి టీఆర్ఎస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. ఆర్మూర్ పట్టణ బీజేపీ కార్యదర్శి పూజ నరేందర్ ఆ పార్టీని వీడడం బీజేపీకి కోలుకోలేని దెబ్బ తగిలినట్లయ్యింది. ఇప్పటికే ఆర్మూర్ మున్సిపల్‌లో కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు అభ్యర్థులు సైతం దొరకక బీజేపీ పెద్దలు తలలు పట్టుకుంటుంటే, సీనియర్ నాయకుడు పార్టీని వీడడంతో గందరగోళానికి దారితీసింది. గత ఎంపీ ఎన్నికల్లో ఎంపీగా ధర్మపురి అరవింద్‌ను గెలిపిస్తే, పసుపు బోర్డు తెస్తామని మేమే ప్రచారం చేశామని, తీరా ఎంపీగా గెలిచిన తర్వాత దానికి భిన్నంగా ఎంపీ మాట్లాడడం విడ్డూరమన్నారు. రానున్న రోజుల్లో టీఆర్ఎస్ పార్టీ ద్వారానే ఆర్మూర్‌లో మరింత అభివృద్ధి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. టీఆర్ఎస్ ఆధ్వర్యంలోనే పసుపు బోర్డు వస్తుందన్నారు. మాజీ ఎంపీ కవిత, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిలు పసుపు బోర్డు సాధనకు, పసుపు పంటకు మద్దతు ధరల కోరకు పోరాటాలు చేశారన్నారు. అలాగే ర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన కాలనీ కమిటీ మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి రామాగౌడ్ కూడా ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

సంక్రాంతి సంబరాలకు దూరం: నారా భువనేశ్వరి

చంద్రగిరి,జనవరి 13(ఆర్ఎన్ఎ): సంక్రాంతి సంబరాలకు తమ కుటుంబం దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి వెల్లడించారు. అమరావతి రైతులు, మహిళలు బాధల్లో ఉండటంతో సంక్రాంతి సంబరాలు చేసుకోవడానికి తమకు మనసు రావడంలేదన్నారు. వారికి మద్దతుగా నిలిచి, అండగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నా మన్నారు. ఏటా నారా, నందమూరి కుటుంబాలు కలిసి నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు చేసుకునేవి.అమరావతిలో రైతులు, మహిళలు చేస్తున్న ఉద్యమానికి హ్యాట్సాఫ్ చెప్పారు. అంతకుముందు మనవడు దేవాన్ష్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి గ్రామదేవత దొడ్డి గంగమ్మకు, కులదైవం నాగాలమ్మకు భువనేశ్వరి పూజలు నిర్వహించారు. తరతరాలుగా ఏటా నాగాలమ్మకు పూజలు చేస్తామని, అందులో భాగంగానే ఇప్పుడు పూజలు చేశామన్నారు. చంద్రన్న మీద నమ్మకంతో, తమ పిల్లలకు భవిష్యత్తు ఉంటుందని భావించి, ఆ రైతులు రాజధానికి భూములిచ్చారని, ఆ రాజధాని కోసం ఇప్పుడు పోరాడు తున్నారని చెప్పారు. మహిళలు తలచుకుంటే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి, చంద్రబాబు తల్లిదండ్రులు నారా ఖర్జూరపునాయుడు, అమ్మణ్ణమ్మ సమాధులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కోడి పందాలకు వందల ఏళ్ల చరిత్ర

పండగలో పందెం రాయుళ్ల హడావిడి

కోళ్లకు కత్తులు కట్టేందుకు రంగం సిద్ధం

ఏలూరు,జనవరి12(ఆర్ఎన్ఎ): కోడి పందాల చరిత్రకు వందల ఏళ్ల చరిత్ర ఉంది.ఆరువేల సంవత్సరాల క్రితం నుంచే అనేక దేశాల్లో ఈ క్రీడ ఉండేదని చెప్పేందుకు చారిత్రక ఆనవాళ్లున్నాయి. 1646లో జార్జి విల్సన్ అనే రచయిత కాక్ ఆఫ్ ది గేమ్ అనే పుస్తకంలో కోడి పందేల గురించి ప్రస్తావించారు. అమెరికా, జపాన్, ఇరాన్, ఇండోనేషియా, బ్రెజిల్, పెరు, ఫిలిపైన్స్, మెక్సికో, ఫ్రాన్స్, క్యూబా, పాకిస్తాన్ మొదలైన దేశాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఈ కోడి పందేలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.మనదేశంలోనూ అనాదిగా కోడిపందేలు జరుగుతూనే ఉన్నాయి. పల్నాటి యుద్ధంలోనూ దీని ప్రస్తావన ఉంది. మధ్య యుగాల నాడు ఈ కోడి పందేలు చూస్తూ ఎంజాయ్ చేయడమే కాదు... గెలుపోటములపై పందేలు కాసేవారు. చివరకు రాజ్యాలు కూడా ఫణంగా పెట్టేవారు. అయితే ఇప్పుడు రాజ్యాలు లేకపోయినా.. కోడిపందేలపై బెట్టింగులు జోరు ఓ రేంజ్‌లో జరుగుతుంది. ఆనాటి ఆచారమే నేటి వరకూ కొనసాగుతోంది. అందుకే కోడి పందాలకు గోదావరి జిల్లాల్లో క్రేజ్ ఏర్పడింది. మరోవైపు పండగ సమీపిస్తున్న వేళ కొందరి ధ్యాసంతా కోడిపందాలపైనే ఉంది. పందాలకు అనుకలంగా నిర్ణయం ఉంటుందా లేదా అన్నదే ఇప్పుడు చర్చ సాగుతోంది. సంప్రదాయ పందేలకు ప్రభుత్వం అడ్డు చెప్పబోదన్న ఆశతో చాలామంది నిర్వాహకులు ఉన్నారు. ఏటా పశ్చిమ గోదావరి జిల్లాలో 450 బరులు ఏర్పాటవుతాయి. సంక్రాంతి మూడు రోజులూ కోట్ల రూపాయల విలువైన పందేలు కడతారు. అయితే ఈసారి కచ్చితంగా కోడిపందేలు లేనట్టేనని కొందరు అంచనా వేస్తుంటే, పండగ దగ్గర పడేసరికి తమకు వాతావరణం సానుకూలం అవుతుందని మరికొందరు ధీమాతో ఉన్నారు. నిజానికి, ఈసారి పెద్దఎత్తున పందెం ఆడేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. పండగకు రెండు నెలల ముందునుంచే, ఈ జిల్లాలో పెద్ద పెద్ద బరులు ఏర్పాటు చేయడం మొదలయింది. నిర్వాహకులు జాతి పుంజులపై లక్షల రూపాయలు ఖర్చుపెట్టుకొన్నారు. భీమవరం, ఉండి, పాలకొల్లు, ఆకివీడు, కాళ్ల, వీరవాసరం, కొణితివాడ, ఆచంట, పెనుమంట్ర, నర్సాపురం, మొగల్తూరు, యలమంచిలి, కలగంపూడి, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, గణపవరం, ఉంగుటూరు ప్రాంతా ల్లో పందెం కోళ్లకు ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తున్నారు. హైకోర్టు తీర్పు ప్రభావం ఈ ప్రాంతాల్లో కనిపిస్తోంది.

పండగ కోసం ప్రత్యేక బస్సులు

అదనపు సర్వీసులు నడుపుతున్న ఆర్టీసీ

కడప,జనవరి12(ఆర్ఎన్ఎ): సంక్రాంతి పండగ కోసం జిల్లావ్యాప్తంగా ఎనిమిది డిపోల పరిధిలో ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ ప్రాంతీయ అధికారి తెలిపారు.సంక్రాంతి పండగకు వచ్చే వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రోజు వారీ బస్సు సర్వీసులు కాకుండా అదనంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. విజయవాడ, హైదరాబాదు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నామని చెప్పారు. హైదరాబాదు నుంచి 35, బెంగళూరు నుంచి 32, చెన్నై నుంచి ఆరు చొప్పున బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యమైన పండగ కావడంతో ఎక్కడెక్కడో ఉన్న వారందరూ వారి వారి సొంత ఊళ్లకు వస్తారని చెప్పారు. ప్రత్యేక బస్సుల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని డిపోల్లో ముందస్తు రిజర్వేషన్ ప్రవేశ పెట్టామన్నారు. అలానే తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్నామన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కావాల్సినన్ని బస్సు సర్వీసులను నడుపుతామని ఆర్ఎం చెప్పారు. బస్సుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాజంపేట, పులివెందులకు బీఎస్-3 రెండు కొత్త అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. ప్రొద్దుటూరు నుంచి వయా కడప మీదుగా బెంగళూరుకు ప్రత్యేకంగా బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో సగం సీట్లు ఏసీ, మిగిలిన సగం నాన్ ఏసీ ఉంటుందన్నారు. కడప నుంచి తిరుపతికి అల్ట్రా డీలక్స్ నాన్‌స్టాఫ్ బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. టీవీ సౌకర్యంతో పాటు సీట్లు చాలా బాగుంటాయని చెప్పారు. రాయచోటి నుంచి వయా కడప బద్వేలు, కావలి మీదుగా విజయవాడకు వెళ్లేందుకు కొత్తగా సూపర్‌లగ్జరీ బస్సు సర్వీసు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక కడప డిపో తప్పా మిగిలిన డిపోలన్నీ నష్టాల్లో నడుస్తున్నాయని చెప్పారు. కాకపోతే రాయలసీమ వ్యాప్తంగా నష్టాలను తగ్గించడంలో కడప జిల్లా నంబరు వన్ స్థానంలో ఉందన్నారు.

కోనసీమలో సీమాంతర కోళ్ల పందాలు

బరికి రెడీ అవుతున్న ప్రజలు

కాకినాడ,జనవరి13(ఆర్ఎన్ఎ): కోనసీమలో సంక్రాంతి సందడి మొదలైంది. భోగి మంటలు, రంగురంగుల ముగ్గులు, పిండి వంటలు, ఇంటి నిండా బంధువులు... సంక్రాంతి అంటే వారం రోజుల పాటు ఇంటింటా సందడే సందడి. ఇదంతా ఒక ఎత్తు అయితే పండుగ సమయంలో గోదావరి జిల్లాలో నిర్వహించే కోడి పందేల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. పైగా ఈసారి కోడి పందేల్లో ఓ ప్రత్యేక ఉంది. పందెం కోళ్లు యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. సంక్రాంతి వచ్చిందటే చాలు జిల్లాలో కోడిపందేలా జోరు కొనసాగుతుంది. కోర్టులు, ప్రభుత్వం, పోలీసులు ఎంత కఠినంగా వ్యవహరించినా వెనక్కి తగ్గరు. పైగా తమిళనాడు లాంటి ప్రాంతాల్లో కోడి పందేలకు ప్రత్యేక టోర్నమెంట్‌లు ఉంటాయని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఆంక్షలు ఉంటాయంటూ మండిపడుతున్నారు. ఎన్ని హెచ్చరికలు ఉన్నా పందేల విషయంలో వెనుకడుగు వేయరు. ప్రధానంగా ఈసారి వెరైటీ కోళ్లు బరిలో ఉండబోతున్నాయి. ఓ వైపు తమిళనాడు కోళ్లుమ మరోవైపు పాక్ కోళ్లు, ఇంకో వైపు స్థానికంగా పెంచిన కోళు కూడా బరిలోకి దిగబోతున్నాయి. ఇప్పటికే జిల్లాలో వీటిని దిగుమతి చేసుకున్నారు. న్యాయస్థానాల ఆదేశాలు.. పోలీసుల ఆంక్షలు చివరి నిమిషంలో ఆచరణకు నోచుకోక పోవడం పరిపాటిగా మారింది. ఈ పందేల్లో పాల్గొనేందుకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం పలువురు తరలివస్తుంటారు. ఈ ఏడాది జిల్లాలో పందేలకు తమిళనాడుకు చెందిన కోళ్లు ముందుగానే కాళ్లు దువ్వుతున్నాయి. రాజమహేంద్రవరంలో ఈ కోళ్లను పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో కోడి ధర రూ.నాలుగు వేల నుంచి రూ.10 వేలకు పైగా పలుకుతోంది. కోరుకొండ, రాజమహేంద్రవరం గ్రామీణం, రాజానగరం తదితర ప్రాంతాల్లో ఇప్పటికే కోడి పందేల జోరు కొనసాగుతుండగా, పందెంకోళ్ల పెంపకం ఓ కుటీర పరిశ్రమగా మారింది. ఈ సీజన్ వస్తే కోళ్లలో రకాన్ని ఆధారంగా రూ.వేలల్లో ధర నిర్ణయిస్తున్నారు. పందేల నిర్వహణకు పది రోజుల ముందే కొనుగోలు చేసి వాటికి మంచి ఆహారం, తర్ఫీదు ఇచ్చి సిద్ధం చేసేందుకు ప్రత్యేకంగా శిక్షకులను సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక గోదావరి కోళ్లతో పాకిస్తాన్ కోళ్లు పోటీపడ బోతున్నాయి. గెలిస్తే కోడిని వండుకుని తినే ఆచారం ఉంది. సంక్రాంతి వేళ గోదావరి జిల్లాల్లో పందెంకోళ్ల మాంసం తప్ప..బ్రాయిలర్, మామూలు కోళ్ల మాంసం కూడా ముట్టుకోరు. పందెంకోడిని బంధుమిత్రులకు వండిపెట్టడం ఓ ప్రత్యేకత. సంక్రాంతి వేళ కోడి పందేలు నిర్వహించేడమే కాదు... ఒక్కో కోడికి రూ. వేల నుంచి లక్షలు ఖర్చు చేసి ఖరీదైన, బలమైన తిండి పెడతారు. వాటికోసం ప్రత్యేక ట్రైనర్లు కూడా ఉంటారు. పందాల్లో పాకిస్తాన్ కోళ్లకు మంచి క్రేజ్ ఉంది. అందుకే ఈ మధ్య థైవాన్, మలేషియా, ఇండోనేషియా, పాకిస్తాన్ లాంటి ప్రాంతాలనుంచి కూడా కోనసీమ పెంపకం దారులు బ్రీడ్ తెప్పించి పెంచుతున్నారు. ముఖ్యంగా కత్తులు కట్టకుండా వేసే పందాలకు పాకిస్థాన్ బ్రీడ్ కోళ్లు బాగా ఉపయోగ పడుతున్నాయని చెబుతున్నారు. ఒకప్పుడు వేల రూపాయల్లో మొదలైన కోడి పందాలు ఇప్పుడు కోట్ల రూపాయల్లో చేతులు మారుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది వంద కోట్ల రూపాయలకు పైగా చేతులు మారాయ్. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఈలెక్క పెరిగిందే కానీ తగ్గలేదు. ఇక పందెంలో వీర మరణం పొందిన పుంజుల .. మాంసానికి చాలా డిమాండ్. వాటిని పెంచడానికి అత్యంత బలమైన ఆహారం పెట్టడంతో ఆ మాంసం రుచి ప్రత్యేకంగా ఉంటుంది. అందుకే పందెంలో ఓడిన కోడిని దక్కించుకునేందుకు వేలం పాటలు జరుగుతాయి.

కోడిపందాలు నిర్వహించే చోట ఎక్సైజ్ నిఘా

మద్యం అమ్మకుండా చర్యలు

విజయవాడ,జనవరి13(ఆర్ఎన్ఎ):ఇక కోడి పందేలు నిర్వహించే బరుల దగ్గర లిక్కర్ అమ్మకాల నిరోధానికి ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కోడిపందేలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు. ఈ సంక్రాంతికి జిల్లాలో కోడిపందేలు జరగకుండా అడ్డుకునేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. కోడి పందేలను అడ్డుకొనేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని పోలీసులు చెప్పారు. వీరు ఆయా ప్రాంతాల్లో వీడియో కెమెరాలతో సహా నిఘా వేసి పందేల కోసం జరిగే ఏర్పాట్లను నిలువరిస్తారని పేర్కొన్నారు. దీనిపై పోలీసు అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. కోడిపందేలు నిర్వహించే వారిపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. అలాగే కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆర్టీసీకి పెరగనున్న ఆదాయం

సంక్రాంతి బస్సులతో పెరిగిన రద్దీ

ఆదిలాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ రీజియన్‌లో సంక్రాంతి పండగ వారం రోజుల్లో పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనెల 12, 13,14 తేదీల్లో అదనపు సర్వీసులు నడుపుతుండగా.. తిరుగు ప్రయాణంలో ఈనెల 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీని బట్టి అప్పటికప్పుడు మరిన్ని బస్సులను పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆరు డిపోలు ఉండగా.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి ప్రతిరోజు ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నారు. పండుగ దృష్ట్యా డిపోలకు అదనంగా సర్వీసులను నడుపుతున్నారు. నిర్మల్ నుంచి కనిగిరి–పామర్రుకు రెగ్యులర్‌గా ఒక బస్సు ఉండగా.. సంక్రాంతి సందర్భంగా మూడు బస్సులు నడుపుతున్నారు. ఇక మంచిర్యాల, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), బెల్లంపల్లి, మందమర్రి, బాసర ప్రాంతాలకు రైలు సౌకర్యం ఉంది. రైళ్లలోనూ తమ స్వస్థలాలకు చేరేందుకు ప్రయాణికులు పెద్ద ఎత్తున వరుస కడుతున్నారు. దీంతో ఆయా రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో వాహనాల రద్దీ ఉంటుందని.. నేరడిగొండ, కడ్తాల్ టోల్ ప్లాజాల వద్ద అన్ని ద్వారాలు తెరిచేశారు. చాలామంది బస్సు ప్రయాణాన్ని ఎంచుకోవడంతో వీటికి డిమాండ్ భారీగా పెరిగింది. సాధారణ రోజుల్లో హైదరాబాద్‌నుంచి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు 500-600 వరకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నడుస్తుంటాయి. అదే సంక్రాంతికి ముందు మూడురోజులు ఆ సంఖ్య ఇంకా పెరుగుతుంది. ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులు వేసినా సరిపోని పరిస్థితి. దీంతో పలు ప్రైవేటు ట్రావెల్స్ అడ్డగోలుగా ధరలు పెంచడం సామాన్య ప్రయాణికులకు పెనుభారంగా మారింది. చాలామంది ట్రావెల్స్ నిర్వాహకులు సీట్లను బ్లాక్ చేసి మూడింతలు, నాలుగింతల ధరలకు విక్రయిస్తున్నారు. రవాణాశాఖకు ఛార్జీలు ఎగవేసేందుకు తప్పుడు మార్గాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న నిర్వాహకులు ప్రతి స్టేజీలో ఆవుతూ ప్రయాణికులను ఎక్కించుకుంటున్నాయి. ఉన్నతాధికారులు ప్రమాదాలు జరిగిన సమయాల్లో హడావుడి చేయడం, తర్వాత చేతులు దులిపేసుకోవడం సర్వసాధారణ మైందనే విమర్శలున్నాయి. పలు ప్రైవేటు ట్రావెల్స్ నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయి. దాదాపు అన్ని బస్సులు స్టేజీ క్యారియర్‌లుగా తిరుగుతున్నాయి.

కడెంలో తగ్గుతున్న నీటిమట్టం

ఆదిలాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): కడెం కుడి కాలువ ద్వారా దిగువ ప్రాంతాలకు నీటి విడుదల కొనసాగుతోంది. ఈ ఏడాది వానాకాలం పంటలకు నీటిని విడుదల చేయ డంతో 4.673టీఎంసీలకు నీటిమట్టం పడిపోయింది. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అధికారులు మరోమారు కోరారు. ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో కుడి కాలువకు నీరు అందక ఇబ్బందులు పడే ఆస్కారం ఉన్న నేపథ్యంలో కుడి కాలువకు మూడు రోజుల ముందుగా నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. రైతులు ఈ నీటితో ఆరుతడి పంటలు సాగు చేసుకుంటూ, చెరువులు, కుంటలు నింపుకోవాలని సూచించారు. కుడి కాలువ పరిధిలోని చెరువులు కుంటలు నింపేందుకు అధికారులు బుధవారం నీటిని విడుదల చేసిన విష యం తెలిసిందే. యాసంగి పంటలకు సాగు నీటిని అందించడం సాధ్యం కాని పక్షంలో చెరువులు, కుంటలు నింపేందుకు నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యేల సమక్షంలో తీర్మానాలు చేయడంతో ఆ తీర్మానాల ప్రకారం కుడి కాలువకు 12 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయకట్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈ నీటి ద్వారా పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించడం సాధ్యం కాని పక్షంలో ఉన్న నీటిని చెరువులు, కుంటలు నింపేందుకు మాత్రమే విడుదల చేయాలని ఇదివరకు నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేలతో పాటు, డిస్ట్రిబ్యూటరీ సంఘాల నాయకులు, రైతులు, అధికారులు తీర్మానించారు.

ఎస్సీ,ఎస్టీ రైతులకు సబ్సిడీ పథకాలు

దళితబస్తీ పథకం ద్వారా భూ పంపిణీ

ఆదిలాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను మంజూరు చేస్తున్నామని తెలిపారు. పాలీహౌస్ వ్యవసాయం కోసం ఒక ఎకరానికి రూ. 33 లక్షలు ఖర్చు అవుతుందని, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వమే ఖర్చులన్నీ భరిస్తుందన్నారు. భూముల అభివృద్ధికి సైతం రుణాలను ఇప్పించి బోరుబావులు, బావులు తవ్వించి నీటి సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకు దళితబస్తీ పథకం ద్వారా ఆదిలాబాద్ నియోజకవర్గంలో వందలఎకరాల భూమిని పంపిణీ చేశామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు.

అలాగే వెయ్యి ఎకరాల భూమి ప్రతిపాదనలో ఉందని స్పష్టం చేశారు. దళితులందరూ ప్రభుత్వం ఇచ్చిన భూమిలో సాగు చేసుకొని అధిక దిగుబడి సాధించి పిల్ల పాపలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో దళితబస్తీ ద్వారా భూమిలేని దళితులందరికీ మూడెకరాల భూమిని కొనుగోలు చేసి ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. గిరిజనులకు సైతం మూడెకరాల భూమిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలందరికీ మూడెకరాల భూమిని పంపిణీ చేసి వారిని రైతులుగా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ మహిళల పేర్లపైనే అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి 5వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించి రైతులు పండించే పంటలపై సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ఒక వ్యవసాయ క్లస్టర్ పరిధిలో రైతు భవనాలను నిర్మిస్తామన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని పరీక్షల ఆధారంగా పంటలు వేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచి సకాలంలో పంపిణీ చేస్తున్నామన్నారు.

ప్రచారాస్త్రాలతో సిద్ధం అవుతున్న అభ్యర్థులు

నేటితో ముగియనున్న ఉపసంహరణలు

ఎవరు ఏ పార్టీ నుంచో తేలనున్న జాబితా

నిజామాబాద్,జనవరి 13(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల్లో ప్రచార పర్వం జోరందుకుంది. ఓటర్లను ఆకర్షించడానికి అభ్యర్థులు ప్రచార పర్వంలో దిగారు. మంగళవారం ఉపసంహరణకు గడువు ఉండడంతో ఏ పార్టీకి చెందిన వారు ఎవరన్నది స్పష్టత రానుంది. సుమారు 20 ఏళ్ల తర్వాత పట్టణ ఓటరు బ్యాలెట్ పత్రాలతో ఓటు హక్కును ఈ నెల 22న వినియోగించుకోనున్నారు. పాటలు, ప్రసంగాలతో హోరెత్తించడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మైకులతో ప్రచారం చేయడానికి కూడా ఎన్నికల కమిషన్ నిబంధనలు విధించింది. అందుకు స్పష్టమైన ఆదేశాల అమలుకు ఎన్నికల అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్దేశిత ధ్వని కన్నా తీవ్రత పెరిగితే సదరు పార్టీలపై కేసులు నమోదు చేయడానికి వీలుంది. అభ్యర్థులు జాగ్రత్త పడకుంటే ఫిర్యాదులతో ఇబ్బందులు పాలుకాక తప్పదు.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు నిబంధనలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవని అధికారులు కూడా హెచ్చరిస్తున్నారు. ప్రచారాలు, ఖర్చులు, బ్యాంకు లావాదేవీల విషయంలో హద్దు దాటితే కఠిన చర్యలు ఉంటాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పలు నిబంధనలు ఇలా ఉన్నాయి. లైసెన్స్ పొందిన తుపాకులను ఎన్నికల వేళల్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించి ఎలక్షన్ల తర్వాత తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల కమిషన్ ఈ మేరకు నిబంధనలను విధించింది. ఎన్నికల వేళ ఓటర్లను ఆయుధం చూపి భయభ్రాంతులకు గురిచేసే ప్రమాదం ఉంటుందని ఈ నిబంధనలు అమలు చేశారు. ఆయుధాలు కలిగిన వ్యక్తులు తమ తుపాకులను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలి. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. ఇకపోతే దాదాపు 20 ఏళ్ల తర్వాత పురపాలక ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలతో ఓటు హక్కును వినియోగించు కుంటున్నారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో ఈవీఎం యంత్రాలతో ఓటుహక్కును వినియోగించుకున్న పట్టణ ఓటర్లు ఈ సారి పురపాలక ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల ద్వార ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన గ్రామపంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల్లో గ్రామాల్లోని ఓటర్లు బ్యాలెట్ ద్వారానే ఓటుహక్కును వినియోగించు కున్నారు. పట్టణంలో పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలు లేనందున వారికి అవకాశం రాలేదు. 2005, 2014 సంవత్సరాల్లో జరిగిన పురపాలక ఎన్నికల్లో ఈవీయం యంత్రాలనే వినియోగించారు. వాటికన్నా ముందు 2000 సంవత్సరంలో జరిగిన పురపాలక ఎన్నికల్లో మాత్రం బ్యాలెట్ పెట్టెలను వాడారు. పురపాలక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఆర్థిక పరమైన అంశాలపై పోలీసులు ఎన్నికల అధికారులు కన్నేశారు. పోటీదారులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు కానుకలు, మద్యం, తదితరలతో పాటు నగదు ఖర్చు చేసేందుకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు డబ్బులు వచ్చే మార్గాలపై అధికారులు దృష్టి పెట్టారు. ముఖ్యంగా బ్యాంక్‌ల నుంచి ఎవరు ఎంత మొత్తంలో డబ్బులు డ్రా చేస్తున్నారనే అంశంపై ఎన్నికల అధికారులు ఆరా తీస్తారు. పెద్ద మొత్తం డబ్బులు పట్టుబడితే, ఆధారాలు చూపకుంటే వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. పురపాలక ఎన్నికల్లో నిర్వహణ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రిసైడింగ్ అధికారులకు డైరీలను అందిస్తున్నారు. పోలింగ్‌కేంద్రంలో జరిగే ప్రతి అంశంతో పాటు సామగ్రి వివరాలకు సంబంధించిన 24 పేజీలను పూర్తిచేసి పోలింగ్ ముగిసిన తర్వాత సామగ్రితో పాటు ఎన్నికల అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. ఎలాంటి సంఘటనలను జరిగినా విధిగా అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. ఓటర్ల వివరాలు, పోలింగ్ కేంద్రం, సిబ్బంది, బ్యాలెట్ పెట్టెలు, పేపర్ సీళ్లు, ఏజెంట్లు, బ్యాలెట్ పత్రాలు, చాలెంజ్ ఓట్లు, టెండర్ ఓటు , కోడ్ ఉల్లంఘన, శాంతిభద్రతల పరిరక్షణ, పొరపాట్లు, అవకతవకలు, తదితర అంశాలను డైరీలో నమోదు చేసి ఎన్నికల అధికారులకు అందివ్వాల్సిన బాధ్యత ప్రిసైడంగ్ అధికారికి మాత్రమే ఉంటుంది. ఎన్నికల్లో ఐదు రకాలు ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఓటుహక్కు కలిగిన వ్యక్తి నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయడాన్ని సాధారణ ఓటుగా వ్యవహరిస్తారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ స్వగ్రామాల్లో ఓటు వేయడానికి వీలు ఉండదు. వీరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించు కుంటారు. దేశ సైనికులు, పారామిలిటరీ ఉద్యోగులు సొంత ప్రాంతాలకు దూరంగా ఉంటారు, వీరు సర్వీస్ ఓటు వేస్తారు. ఓటరు జాబితాలో పేరుండి, తాము పోలింగ్ కేంద్రానికి వెళ్లే సరికి తమ ఓటు వేరొకరు వేసినట్లయితే అసలైన ఓటరుకు టెండర్ ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తారు.

గ్రామాల విలీనంతో పెరిగిన ఓటర్లు

36 నుంచి 49కి పెరిగిన వార్డుల సంఖ్య

భారీగా నామినేషన్లు దాఖలు

ఉపసంహరణ తరవాత అభ్యర్థులు సంఖ్యపై స్పష్టత

ఆదిలాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ మున్సిపాలిటీకి ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని పార్టీలతో పాటు ఇండిపెండెంట్‌లు నామినేషన్లు వేశారు. గతంలో మున్సిపల్ పరిధిలో వార్డులు సంఖ్య 36 ఉండగా పునర్విభజనలో భాగంగా ఈ సంఖ్య 49కి చేరింది. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి ఈ సారి జరిగే ఎన్నికల్లో వార్డుల సంఖ్య పెరిగడంతో పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య కూడా పెరిగింది. గతంలో ఆదిలాబాద్ రూరల్, మావల మండలాల్లోని పలు గ్రామాలు మున్సిపల్ పరిధిలోకి వచ్చాయి. దీంతో గతంలో గ్రామపంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యులుగా పోటీ చేసిన వారు ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో పలు వార్డుల్లో నామినేషన్లు ఎక్కువ సంఖ్యలో దాఖలయ్యాయి. వార్డుల రిజర్వేషన్ల అనంతరం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో పలు వార్డుల నుంచి ఆశావహులు ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్‌లో తమ వార్డుల్లో వచ్చిన రిజర్వేషన్ల ఆధారంగా నామినేషన్లు వేశారు. రిజర్వేషన్లు అనుకూలించని వారు తమ కుటుంబసభ్యులను పోటీలో నిలిపారు. ప్రధానంగా విలీన గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు వచ్చాయి. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో మొత్తం 1,27,801 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు, 63,057 మంది, మహిళలు 64,738 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. మున్సిపాలిటీలో ఎస్టీ ఓటర్లు 5380 మంది ఉండగా వీరిలో పురుషులు 2629 మంది, మహిళలు 2751 మంది, ఎస్సీ ఓటర్లు 16,833 మంది ఉండగా పురుషులు 8144 మంది, మహిళలు 8689 మంది, బీసీ ఓటర్లు 72,095 మంది ఉండగా పురుషులు 35,617 మంది, మహిళలు 36,476 మంది, ఇతర కులాలకు చెందిన ఓటర్లు 33,493 మంది ఉండగా వీరిలో పురుషులు 16,667, మహిళలు 16,822 మంది ఉన్నారు. క్రితం సారి జరిగిన ఎన్నికల్లో మున్సిపల్ పరిధిలో వార్డుల సంఖ్య 36 ఉండగా పునర్విభజనలో భాగంగా ఈ సంఖ్య 49కి పెరిగింది. ఆదిలాబాద్ రూరల్ మండలంతో పాటు మావల మండలంలోని పలు గ్రామాలు మున్సిపల్ పరిధిలోకి వచ్చాయి. దీంతో గతంలో కన్నా ఈ సారి ఓటర్ల సంఖ్య సైతం గణనీయంగా పెరిగింది. త్వరలో ఎన్నికలు జరిగే వార్డులకు నిబంధనల ప్రకారం 50 శాతం మహిళలకు, ఆయా వార్డుల్లో ఓటర్ల జనాభా ఆధారంగా పలు వర్గాలకు రిజర్వేషన్లు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల విత్‌డ్రా కొనసాగుతున్నది. పరిశీలన తర్వాత బరిలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులతోపాటు ఇండిపెండెంట్‌లు 398 మంది నామినేషన్లను అధికారులు ఆమోదించారు. ఆదివారం ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసహరించుకున్నట్లు ఆయా వార్డులకు చెందిన రిటర్నింగ్ అధికారులు తెలిపారు. మంగళవారం చివరితేదీ కావడంతో మరిన్ని నామినేషన్లకు ఉపసంహరించుకునే వీలుంది.

జనగామ నుండి ప్రత్యేక బస్సులు

సంక్రాంతి రద్దీకి అనుగుణంగా సర్వీసులు

జనగామ,జనవరి13(ఆర్ఎన్ఎ): సంక్రాంతి సందర్భంగా తెలంగాణ జనగామ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో హన్మకొండ, హైదరాబాద్ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డీఎం వెల్లడించారు.

హైదరాబాద్, హన్మకొండ నుంచి జనగామకు వచ్చే ప్రయాణికులతో పాటు జనగామ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు జనగామ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి వయా జనగామ మీదుగా హన్మకొండకు, హన్మకొండ నుంచి వయా జనగామ మీదుగా హైదరాబాద్ ఉప్పల్ ఎక్స్‌రోడ్కు ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు సౌకర్యం ఉంటుందని వెల్లడించారు.

ఈప్రత్యేక సర్వీస్‌లు ఈ నెల 17 వరకు ఉంటాయన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను వినియోగించు కొని క్షేమంగా తమ గమ్యాలకు చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా మేడారం జాతరకు వెళ్లే ప్రయాణికులకు కూడా బస్సు సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

కళకళలాడుతున్న వస్త్రవ్యాపారం

డిస్కౌంట్లు, ఆఫర్ల మోత

విజయవాడ,జనవరి13(ఆర్ఎన్ఎ): ఏ షాపులో చూసినా మహిళామణులదే హడావిడి. దీంతో మెయిన్‌రోడ్డుతోపాటు తాడితోట వస్త్రదుకాణ సముదాయం లోనూ షాపులన్నీ పండుగ కళను సంతరించుకుంటున్నాయి.రెడీమేడ్ వస్త్రమార్కెట్లో డిస్కౌంట్లు, ఆఫర్లమోత మోగుతోంది. పెద్ద పండగ సంక్రాంతికి మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉండంతో వస్త్ర మార్కెట్లో మాత్రం సందడి వాతావరణం కనిపిస్తోంది. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ ప్రకటనలతో చిన్నవ్యాపారులు చితికి పోతున్నారు. తమవైపు ఎవరుచూడడం లేదని వాపోతున్నారు. ఒకటి కొంటే ఒకటి ఉచితం వంటి ఆఫర్లు, డిస్కౌంట్లు ఆకర్షణీయంగా కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం షాపింగ్‌కోసం మహిళలు, యువతులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. పురుషుల సంఖ్య చాలా తక్కువగానే ఉంటోంది. ఆకర్షణీయమైన ప్రకటనతో మహిళలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పెద్దషాపులన్నీ కొనుగోలుదారులతో రద్దీగా మారుతున్నాయి. కోటగుమ్మం సెంటర్‌లో రెడీమేడ్ వస్త్రాలు, చీరలు విక్రయించే ఒకటి, రెండు పెద్ద షాపులు, ఆఫర్ల కారణంగా రద్దీగా కనిపిస్తున్నాయి. ఇక్కడి పెద్ద షాపు ల్లో ఒకటి కొంటే ఒకటి ఉచితం ఆఫర్ తారకమంత్రంలా మహిళలను ఆకర్షిస్తోంది. సూరత్‌శారీస్, కుర్తీలు, చుడీదార్లపై ఈ ప్రత్యేక ఆఫర్ పెట్టడంతో యువతులు పెద్ద సంఖ్యలో అటు వెళ్తున్నారు. ఒకటి, రెండు రెడీమేడ్ షాపుల్లో 20శాతం నుంచి 30శాతం డిస్కౌంట్లు కూడా పెట్టేశారు. అన్ని రకాల వస్త్రాలపై 10శాతం డిస్కౌంట్, పట్టుచీరల కొనుగోలుపై వడ్డాణం ఉచితం, కొనుగోళ్లపై బకెట్లు, బ్యాగ్‌లు, కుర్చీలు ఉచితం అంటూ ఆకట్టుకునే ప్రకటనలు గుప్పిస్తున్నారు. సంపన్నులతోపాటు మధ్యతరగతి వర్గాలు, దిగువ మధ్య తరగతి కూడా ఈ పెద్దపెద్ద షాపులకే మళ్లుతుండడం గమనార్హం. దీంతో చిన్నవ్యాపారులకు బేరాల్లేకుండా పోతున్నాయి. రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో రెడీమేడ్ షాపులు పెద్దవి పది నుంచి పదిహేను వరకూ ఉంటే చిన్న షాపులు వందల్లో ఉన్నాయి. ఇక తాడితోటలో మధ్య, చిన్నవ్యాపారులే ఎక్కువ. కాగా, తాము పండగ ఆఫర్లు పెడుతున్నా దిగువ మధ్య తరగతి వర్గాలను సైతం ఆకట్టుకోలేకపోతున్నాయని చిన్న వ్యాపారులు కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వస్త్ర వ్యాపారాలు అంతంతమాత్రంగానే ఉన్నా భోగి పండక్కి రెండురోజుల ముందునుంచైనా వ్యాపారాలు ఊపందుకుంటాయనే ఆశతో చిన్న వ్యాపారులున్నారు. ఆ నాలుగైదు రోజులు పూర్తిగా వ్యాపారం సాగితే తాము తేరుకోగలమని, లేకుంటే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని వాపోతున్నారు. పెద్దవ్యాపారులకు వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. పండక్కి మరింత రద్దీ పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్లో బాహుబలి చీరలు, పండగచేస్కో చీరలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఇన్ని ఆఫర్లు, డిస్కౌంట్లు పెట్టినా ప్రస్తుతం చిన్నవ్యాపారులవైపు మహిళలు చూడడంలేదు. పెద్ద షాపింగ్‌మాల్స్‌వల్ల చిన్న వ్యాపారాలు దెబ్బతీస్తున్నాయని ఓ వస్త్రవ్యాపారి తెలిపాడు. ఇక ఫుట్‌పాత్ రెడీమేడ్ వస్త్ర వ్యాపారం ఇక్కడ జోరుగా సాగుతోంది. రోడ్డుపైన గుట్టలుగా పోసి విక్రయాలు చేస్తున్నారు. రూ.100, రూ.150కే చుడీదార్లు, షర్టులు, జీన్ ఫ్యాంటులు విక్రయించేస్తున్నారు. యువతుల పంజాబీ డ్రెస్సు రూ.100, బాక్సు ఐటమ్‌గాపెద్దవాళ్ల ఫుల్‌హ్యాండ్ షర్టు రూ.150, చిన్నపిల్లలకు టీ షర్టు, ఫ్యాంటు కలిపి రూ.150కే విక్రయిస్తున్నారు. దీంతో వీటి అమ్మకాలు హాట్‌హాట్‌గా జరుగుతున్నాయి. దీనివల్ల కూడా చిన్నవ్యాపారులకు బేరాల్లేకుండా పోతున్నాయని చెబుతున్నారు.

రైతు సంక్షేమానికి కృషి

మహబుబాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నిరంతరంగా పాటుపడుతున్నారని ఎమ్మెల్యే రెడ్యా నాయక్ అన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో రిజర్వేషన్ల వల్ల మహిళలకు అవకాశం వచ్చిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందించేందుకు సీఎం నిరంతరంగా కృషిచేస్తున్నారన్నారు. సాగునీటిని అందించేందుకు ఎక్కడ అవసరం వస్తే అక్కడ రిజర్వాయర్లను నిర్మిస్తున్నారన్నారు. మూలనపడిన మార్కెట్‌ను గాడిన పడేందుకు మార్కెట్ కమిటీ నిరంతరంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ పాలకమండలికి తోడుగా వ్యాపారులు కూడా తోడ్పాటును అందించడం వల్లే నేడు మార్కెట్ సక్రమంగా నడుస్తున్నట్లు తెలిపారు. నగదు రహిత లావాదేవీల ద్వారా రైతులకు నేరుగా ఖాతాలోకి డబ్బులు జమవుతున్నాయని, ప్రతి రైతు బ్యాంక్ ఖాతాలను తీసుకోవాలని ఆయన కోరారు.

కళ్యాణలక్ష్మితో పేదింటికి వరం

ఆదిలాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం కళ్యాణ లక్ష్మితో ఒక్కో కుటుంబానికి రూ.లక్ష,116 అందజేసి ఆ కుటుంబానికి సీఎం కేసీఆర్ పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. అమ్మఒడి, కేసీఆర్ కిట్ ద్వారా గర్భిణులు, బాలింతలను సంరక్షిస్తున్నామని చెప్పారు. మహిళా, డ్వాక్రా సంఘాలకు సొసైటీ ఏర్పాటు చేసి వారికి ఉపాధి అవకాశాలను పెంపొందించి కుటీర పరిశ్రమలు నెలకొల్పి వ్యాపార రంగంలో ప్రోత్సహిస్తామని తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తట్టుకోలేక కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఆసరా పింఛన్లు, వితంతు పింఛన్లతో పాటు ఒంటరి స్త్రీలకు సైతం నెలకు రూ.వెయ్యి పింఛన్ అందజేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. దీంతో పాటు కేజీ టూ పీజీలో భాగంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందిస్తామన్నారు. అందుకే మరో 20ఏళ్ల పాటు టీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంటుందని, ముఖ్యమంత్రిగా కేసీఆర్ కొనసాగుతారని ఆమె అన్నారు.

ఏకగ్రీవ వార్డుల్లో టీఆర్ఎస్ ముందంజ

నేటితో ఉపసంహరణకు గడువు

హైదరాబాద్,జనవరి 13(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల్లో పటణాల్లో పలు వార్డుల్లో టీఆర్ఎస్ ఏకగ్రీవాల్లో దూసుకుపోతున్నది. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండగానే 15 వార్డులను ఏకగ్రీవం చేసుకున్నది. ఈ నెల 14వతేదీ దాక నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉన్నది. అదేరోజు పార్టీ అభ్యర్థులు తమ బిఫారాలను సమర్పించాల్సి ఉంటుంది. అప్పటివరకు మరిన్ని వార్డులు ఏకగ్రీవమయ్యే అవకాశాలున్నాయి. వార్డుల్లో ఏకగ్రీవాలు టీఆర్ఎస్ నాయకుల్లో మరింత ఉత్సాహన్ని నింపుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 17 వార్డులు ఏకగ్రీవం కాగా.. ఇందులో 15మంది టీఆర్ఎస్‌కు చెందినవారు ఉన్నారు. మరో ఇద్దరు ఎంఐఎంకు చెందినవారు. మొత్తం 3,112 వార్డులు, డివిజన్లలో 25,768 మంది నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని పరకాల మున్సిపాలిటీలో అత్యధికంగా నాలుగువార్డులు ఏకగ్రీవమయ్యాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, బైంసా మున్సిపాలిటీల్లో రెండుచొప్పున ఏకగ్రీవమయ్యాయి. మహబూబాబాద్, సత్తుపల్లి, సిరిసిల్ల, పెద్దపల్లి, అలంపూర్, బాన్సువాడ, వనపర్తి, దుండిగల్ మున్సిపాలిటీల్లో ఒక్కోవార్డు చొప్పున నామినేషన్లు వచ్చాయి. ఇదఠ్గ÷ళిపులో పెద్దఎత్తున ఏకగ్రీవాలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కాగా, అధికారిక అభ్యర్థి కాకుండా.. పార్టీ నుంచి నామినేషన్లు వేసినవారి ఉపసంహరణపై టీఆర్ఎస్ నేతలు దృష్టి సారించారు. వారికి ఎందుకు టిక్కెట్లు ఇవ్వలేకపోయామో వివరిస్తూ.. భవిష్యత్‌లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇస్తున్నారు. మరో నాలుగేండ్లు టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని.. నామినేటెడ్, మార్కెట్ కమిటీ, దేవాలయ కమిటీల్లో అవకాశం వస్తాయని భరోసా కల్పిస్తున్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో నామినేషన్ల పర్వం ముగిసింది. మూడురోజుల పాటు నామినేషన్ల ప్రక్రియ కొనసాగగా.. 60 డివిజన్లకు మొత్తం 1,022 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరిరోజు అత్యధికంగా 551 నామినేషన్లు వచ్చాయి. సోమవారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన ప్రారంభమవుతుంది.

నగరంలో సంక్రాంతి శోభ

కనువిందు చేస్తున్న శిల్పారామం

పలుచోట్ల ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్లు

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): భాగ్యనగరంలో సంక్రాంతి సందడి కనువిందు చేస్తోంది. శిల్పారామంలో సంక్రాంతి శోభ కనిపిస్తోంది. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేశారు. ఇటీవల ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఇక్కడ సంబరాలను ప్రారంబి చారు. ఇకపోతే పరేడ్ మైదానంలో కైట్ ఫెస్టివల్ అలరించ నుంది. కైట్,స్వీట్ ఫెస్టివ్ ముాడ్రోజుల పాటు సాగనుంది. పండగ కోలాహలంతో నగరం సరికొత్త శోభను సంతరించుకుంది.. ఇప్పటికే నాంప ల్లిలో నుమాయిష్.. పీపుల్ ప్లాజాలోని హునాం హాట్ నగరవాసులకు ఆతిథ్యంతోపాటు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎగ్జిబిషన్లకు వెళ్లి సరదాగా గడుపుతున్నారు. ఆదివారం సందర్భంగా ఎగ్జిబిషన్‌కు భారీగా సందర్శకులు తరలి వచ్చారు. రాత్రి 11 గంటవరకు రద్దీ కొనసాగింది. వాహన పార్కింగ్ కోసం సందర్శకులు ఇబ్బంది పడ్డారు. ఎగ్జిబిషన్‌లో అనేక స్టాళ్లు ఇంకా ఏర్పాటు కాలేదు. మొత్తంగా నుమాయిష్ నగరవాసులను ఎంతగానో ఆకట్టుకు ంటుంది. అందులో కూడా అన్ని రకాల షాపింగ్స్ అందుబాటులో ఉన్నాయి. ఫిబ్ర వరి 15 వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబా టులో ఉండనుంది. మరో అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ నేటి నుంచి ప్రారంభం అయ్యింది. ఆటబొమ్మల నుంచి అలంకరణ వస్తువుల వరకు విక్రయానికి ఉండటంతో నగరవాసులు పండగ షాపింగ్‌లు చేస్తున్నారు. మరోవైపు నేటి నుంచి కైట్, స్వీట్ ఫెస్టివల్ ప్రారంభం కానుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే విధంగా కైట్, స్వీట్ ఫెస్టివెల్‌ను వైభవంగా నిర్వహిస్తుండడం హర్షణీయం. దేశ వ్యాప్తంగా పలు వ్యాపారులు తమ ఉత్పత్తులను భాగ్యనగంలో విక్రయించడానికి ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా స్వీట్స్ పండుగ.. నగరవాసులకు సరికొత్త రుచులను అందించనుంది. గుజరాతీ, రాజస్తాన్, పశ్చిమబెంగాల్, అస్సాం, ఢిల్లీ, ముంబై రాష్ట్రల్లో నోరూరించే స్వీట్లు అన్నీ సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో అందుబాటులో ఉంటాయి. ఓ వైపు కైట్ ఫెస్టివల్..మరోవైపు స్వీట్ ఫెస్టివల్ నగరవాసులకు సంక్రాంతి సందడిని రెట్టింపు అందించనున్నాయి. మొత్తంగా నగరంలో జరుగుతున్న పలు రకాల ఎగ్జిబిషన్లు ఆకట్టుకుంటున్నాయి. పీపుల్స్ ప్లాజాలో మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శా ఖ ఆధ్వర్యంలో 'హస్తకళలు, వంటకాల సంగమం(హునార్ హాట్)' కొలువుదీరింది. ఈనెల 11 నుంచి 19 వరకు హునార్ హాట్ ఉంటుంది. సుమారు 130 స్టాళ్లకుపైగా ఉన్నాయి. షాపింగ్ చేయడానికి అనువుగా తీర్చిదిద్దారు. పల్లెటూరి వాతావరణాన్ని తలపించేలా సంక్రాంతి సందడి చేసుకునే విధంగా హునార్ హాట్‌ను ఏర్పాటు చేశారు. గంగిరెద్దులు, ఏనుగుబొమ్మ, కచ్చరం, రైలుబండి తదితర వాటిని ఏర్పాటు చేయడంతో కుటుంబస మేతంగా సందడిగా గడుపుతున్నారు. సాయంత్రం రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఉదయం 11గంటల నుంచి రాత్రి 10:30 వరకు హునార్ హాట్‌ను సందర్శించవచ్చు. ముఖ్యంగా చిన్నారులను హునార్‌హాట్ ఎంతగానో ఆకర్షిస్తుంది. సెల్ఫీలతో నగరవాసులు సందడి చేస్తున్నారు. దేశంలో పలు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాధారణ పొందిన ఫేమస్ ఫుడ్ హునార్‌హాట్‌లో అందుబాటులో ఉంది. ఇతర రాష్ట్రాల ఆహారపదార్థాల రుచులు చూడటాని కి ఆయా రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. హునార్‌కు వెళితే సరిపోతుంది. అక్కడికక్కడే తయారీ చేసి..మనకునచ్చిన వంటకాలను అందిస్తారు. ముఖ్యంగా నాన్‌వెజ్ బిర్యానీల ఘుమఘుమలు అదిరిపోతున్నాయి. చట్నీలు, స్వీట్లు, స్పెషల్ మట్టి గ్లాస్‌లో ఛాయ్..పండ్ల రసాలు. .రాజస్తాన్ పానీపూరీ, గృహతయారీ లడ్డూలు.. మొత్తం గా ఆహారపదార్థాలన్నీ ఒకే చోట కనిపించి నోరూరిస్తున్నాయని సందర్శకులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఫుడ్‌ను టేస్ట్ చేయాలంటే కొంచం ఖరీదైన తినాల్సిందేనని తెలిపారు. మరోవైపు ఇంటి అలంకరణ వస్తువులు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. మెటల్‌తో తయారు చేసిన క్రాఫ్ట్ విక్రయిస్తున్నారు. హ్యాండీక్రాఫ్ట్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మొత్తంగా సంక్రాంతి ఎగ్జిబిషన్లు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి.

శబరిమల వివాదం.. 17న సుప్రీం లాయర్ల సమావేశం

న్యూఢిల్లీ,జనవరి13 (ఆర్ ఎన్ఎ):శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలోకి మహిళల ప్రవేశం అంశంపై సుప్రీంకోర్టు ఓ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నది. శబరిమల తీర్పును సమీక్షించాలని వేసిన పిటిషన్లపై సుప్రీం సోమవారం వాదనలు విన్నది. అయితే రివ్యూ పిటిషన్లను సమీక్షించడంలేదని, గత ధర్మాసనం వేసిన ఏడు ప్రశ్నల గురించి వాదనలు జరపనున్నట్లు చీఫ్ జస్టిస్ ఎస్ఏ బోబ్డే తెలిపారు. 9 మంది సభ్యుల ధర్మాసనం ఇవాళ ఈ కేసును విచారించింది. వివిధ పిటిషన్ల తరపున వాదిస్తున్న లాయర్లు అంతా ఈనెల 17వ తేదీన ప్రత్యేకంగా సమావేశం కావాలని సుప్రీం ఆదేశించింది. శబరిమలలో మహిళల ప్రవేశం, ఇతర మతాల అంశాల గురించి ఆ సమావేశంలో కోర్టు కొన్ని ప్రశ్నలను క్రోడీకరించనున్నది. సుప్రీం ధర్మాసనంలో బోబ్డేతో పాటు జస్టిస్ ఆర్ భానుమతి, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు, జస్టిస్ ఎం శాంతన గౌదార్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ ఆర్ఎస్ రాయ్ ది, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలు ప్రవేశించవచ్చు అని ఇటీవల సుప్రీం తీర్పునిచ్చిన విషయం తెలిసిందే.

ప్రధాని పర్మిషన్ ఇస్తారులే

- పీవోకేలో తుక్డే.. తుక్డే గ్యాంగ్ అంత చూడండి

- ఆర్మీచీఫ్‌కు మద్దతు పలికిన శివసేన

న్యూఢిల్లీ, జనవరి13(ఆర్ఎన్ఎ) : ఇండియన్ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణె వ్యాఖ్యలకు శివసేన పార్టీ మద్దతు పలికింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) భారత్‌లో అంతర్భాగమేనని భారత ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ తెలిపారు. జమ్ము- కశ్మీర్ పూర్తిగా మనదేనని ఎప్పటి నుంచో పార్లమెంటు తీర్మానం ఉందని, అదినిజం కావాలని పార్లమెంటు కోరితే సాకారమైపోతుందని అన్నారు. ప్రభుత్వం నుంచి ఎప్పుడు ఆర్డర్స్ వస్తే అప్పుడు తాము బరిలోకి దిగుతామని చెప్పారు. అయితే ఇండియన్ ఆర్మీచీఫ్ చేసిన వ్యాఖ్యల్ని సమర్థిస్తూ శివసేన అధికార పత్రిక సామ్నా కథనాన్ని ప్రచురించింది. తుక్డే.. తుక్డే గ్యాంగ్ లకు వ్యతిరేకంగా విమర్శలు చేయడం కంటే.. సైన్యానికి ఓ మ్యాప్ ఇచ్చి తుక్డే-తుక్డే గ్యాంగ్ ను తుడిచిపెట్టేలా ప్రభుత్వం అనుమతివ్వాలని సామ్నా తన కథనంలో ప్రధానంగా హైలెట్ చేసింది. ఆర్మీచీఫ్ చేసిన వ్యాఖ్యల్లో తప్పులేదని ఐఎస్ఐ సహకారంతో పీఓకేలో పాక్ ఉగ్రవాద శిక్షణా శిబిరాల్ని నిర్వహిస్తుందని ప్రచురించింది. అదే సమయంలో యూరీలో సర్జికల్ స్ట్రైక్ చేసినా పాక్ తీరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. తన సంపాదకీయంలో సైనికుల హత్య గురించి ప్రస్తావిస్తూ రాజకీయం, ఎన్నికల ప్రయోజనాల కోసం మాత్రమే కాశ్మీర్ సమస్య తెరపైకి వచ్చిందని సామ్నా తెలిపింది. పీఓకేను ఆక్రమించేందుకు కేంద్ర ఆదేశాల కోసం ఆర్మీచీఫ్ వేచి ఉండడాన్ని నొక్కాణిస్తూ సంపాదకీయంలో ప్రస్తావించిన సామ్నా.. ప్రధాని నరేంద్ర మోడీ అలాంటి ఆదేశాలు ఇస్తారని, దేశం కోరుకునేది ఇదేనని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఆర్టికల్ 370 ను రద్దు చేసినందుకు హోంమంత్రి అమిత్ షాను అభినందిస్తూ, ఇప్పుడు ఇండియన్ ఆర్మీచీఫ్ మనోజ్ ఆధ్వర్యంలో మోడీ-అమిత్ షా నుండి ఆదేశాలు వచ్చిన వెంటనే సొంతమవుతుందన్నారు. ఫిబ్రవరి 1994 లో భారత పార్లమెంట్ పీవోకే సహా మొత్తం జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో విడదీయరాని భాగమని ఓ తీర్మానాన్ని ఆమోదించినట్లు కథనంలో సామ్నా పేర్కొంది.

అమరావతిలో ఆందోళన ఉధృతం

- 27వ రోజు కొనసాగిన దీక్షలు, ధర్నాలు

- వైసీపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

అమరావతి, జనవరి13(ఆర్ఎన్ఎ) : అమరావతిలో రైతుల ఆందోళనలు 27వ రోజుకు చేరుకున్నాయి. రాజధాని గ్రామాల్లో దీక్షలు, ధర్నాలు, నిరసనలు చేస్తున్నారు. ఇటు పోలీసుల ఆంక్షలు కూడా కొనసాగుతున్నాయి. 144 సెక్షన్ అమల్లోకి ఉందని పోలీసులు చెబుతున్నారు. దీంతో రైతులు తమకు తోచిన విధంగా నిరసనలు తెలియజేస్తున్నారు.

పోలీసుల తీరుపై ఆగ్రహంతో ఉన్న రైతులు, అమరావతిలో స్థానికులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. వారికి ఎవరూ సహకరించకూడదని తీర్మానం చేసుకున్నారు. 144 సెక్షన్ కొనసాగిస్తుండటంతో పాకిస్థాన్‌లో ఉన్నామా..? అమరావతిలో ఉన్నామా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రైతులు, మహిళలపై లాఠీఛార్జ్ ఘటనపై మండిపడ్డారు. ఇదిలాఉంటే పోలీసులకు సహాయ నిరాకరణ చేస్తున్నారు. పోలీసులకి నీళ్లు, టిఫిన్, భోజనం అమ్మకాలు నిలిపివేయాలని కొన్ని గ్రామాలు నిర్ణయించాయి. పోలీసులకు ఎటువంటి విక్రయాలు చెయ్యవద్దని దుకాణ యజమానులకు గ్రామస్థులు చెప్పారు. మందడంలో పోలీసులు రోడ్లపై ఎవరిని తిరగనివ్వ డంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా, పోలీసులపై కోపంతో.. కొంతమంది యువకులు వినూత్నంగా నిరసన తెలియజేశారు. గ్రామంలో ఉన్న పంచాయితీ బల్లలపై పోలీసులు కూర్చోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఆ బల్లలపై మడ్డి ఆయిల్‌ను పూశారు. ఊరులో తమను కూర్చోనివ్వ కుండా.. పోలీసులు మాత్రం హాయిగా కూర్చుంటారా అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అదుపులోకి తీసుకున్న పోలీసులు..

మూడు రాజధానులతోనే అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందని పేర్కొంటూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సోమవారం అమరావతి ప్రాంతంలో ర్యాలీ నిర్వహించేందుకు పూనుకున్నారు. దీంతో రామకృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సెక్షన్ 30 అమలులో ఉంటే దీక్ష శిబిరాలు ఎలా పెడతారని రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. డీజీపీ తక్షణం దీక్ష శిబిరాలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని ఉల్లంఘించానని తనపై కేసులు పెట్టారని.. అదే చట్టం టీడీపీ వాళ్లకు వర్తించదా? అని ఆళ్ల ప్రశ్నించారు. దీక్షలో 10, 20శాతం మందే రైతులు ఉన్నారని.. మిగిలిన వారంతా టీడీపీ అధినేత చంద్రబాబు బినామీలన్నారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసిన వ్యక్తులేనని ఆరోపించారు. దీక్షా శిబిరాల్లోకి చంద్రబాబు అసాంఘిక శక్తులను పంపారన్నారు. రైతులు నమ్మి భూములిస్తే చంద్రబాబు ద్రోహం చేశారన్నారు. టీడీపీ నేతలు రైతులను రెచ్చగొడుతున్నారని ఆళ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఉచ్చులో ఎవరూ పడవద్దని.. ఐదేళ్లుగా చంద్రబాబు చేసిన మోసానికి రైతులు బలయ్యారన్నారు. రైతులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అమరావతిలో రాజధాని వద్దని చెప్పినా చంద్రబాబు పెడచెవినపెట్టారన్నారు. మూడు పంటలు పండే భూముల్లో బాబు రాజధాని పెట్టారని ఆళ్ల విమర్శించారు. .

భర్త వేధింపులపై తెగించిన ఇల్లాలు

నడివీధిలో భర్తను పరుగెత్తించి దాడి

బెంగళూరు,జనవరి13(ఆర్ఎన్ఎ): భర్త వేధింపుల తట్టుకోలేక అతడిని నడివీధిలో భార్య తరిమి కొట్టిన సంఘటన కర్నాటకలో యశ్వంత్‌పూర్‌లో చోటుచేసుకుంది. మారుతీ సేవనగర్‌లో వినోద్, దివ్యాలు అనే దంపతులు నాలుగు సంవత్సరాల నివసిస్తున్నారు. మనస్పర్థల కారణంగా తల్లి దివ్యతో కలిసి ఉంటుంది. దివ్యను ఎదో ఒక రకంగా వినోద్, అతడి కుటుంబ సభ్యులు వేధించేవారు. దీంతో వినోద్‌కు బుద్ధి చెప్పాలని తన బంధువైన కానిస్టేబుల్‌ను అతడికి వద్దకు తీసుకెళ్లి గొడవకు దిగింది. వినోద్ ను నడిబజార్ పరుగులు పెట్టించి తీవ్రంగా అతడిని తీవ్రంగా కొట్టింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వినోద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్భయ దోషులకు డమ్మీ ఉరి

16న ఇసుక బస్తాలతో ప్రాక్టిస్

న్యూఢిల్లీ,జనవరి13(ఆర్ఎన్ఎ): నిర్భయ కేసులో నలుగురు దోషులకు ఈ నెల 22న ఉరి తీసేందుకు డెత్ వారంట్ జారీ అయిన నేపథ్యంలో ముందుగా ఈ నెల 16వతేదీన ఇసుకబస్తాలతో డమ్మీ ఉరి తీసేందుకు తిహార్ జైలు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత నెలలో బక్సర్ జైలు నుంచి కొనుగోలు చేసిన కొత్త ఉరి తాళ్లతో ఇసుక బస్తాలను ఉపయోగించి 16వతేదీ ఉదయం డమ్మీ ఉరి తీయనున్నట్లు తిహార్ జైలు అధికారి ఒకరు వెల్లడించారు. నిర్భయ దోషులైన పవన్‌గుప్తా, అక్షయ్, వినయ్ శర్మ, ముకేశ్ సింగ్‌ల బరువు ఆధారంగా ఇసుక సంచులను సిద్ధం చేశారు. ఇసుక బస్తాలకు ఉరి తాళ్లు బిగించి డమ్మీ ఉరి (మాక్ హ్యాంగింగ్) తీయాలని జైలు అధికారులు నిర్ణయించారు. గతంలో ఈ తిహార్ సెంట్రల్ జైలులో ఒకేసారి ఇద్దరు దోషులను ఉరి తీశారు. నిర్భయ కేసులో నలుగురు దోషులకు ఏకకాలంలో ఉరి తీసేలా జైలులోని 3వ నంబరు గదిలో ఉరి ప్రాంగణాన్ని విస్తరించారు. తిహార్ జైలు లోపల వేర్వేరు జైలు గదుల్లో ఉన్న నలుగురు నిర్భయ దోషులను ఉరి తీసే జైలు నంబరు 3కి తరలించనున్నట్లు జైలు సీనియర్ అధికారులు చెప్పారు.దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిర్భయపై సామూహిక అత్యాచారం, హత్య కేసులో నలుగురు దోషులకూ జనవరి 22వ తేదీ ఉదయం 7 గంటలకు తీహార్ జైలులో చనిపోయే వరకూ వారిని ఉరి తీయాలని పటియాలా హౌస్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి సతీశ్ కుమార్ అరోరా డెత్ వారెంట్లు జారీ చేశారు.

నిషేధాజ్ఞల్లో దీక్ష శిబిరాలకు అనుమతిస్తారా?

చంద్రబాబు డ్రామాలపై కళ్లు తెరవాలి

శిబిరాలు వెంటనే ఎత్తేయాలన్న ఎమ్మెల్యే ఆళ్ల

అమరావతి,జనవరి13(ఆర్ఎన్ఎ): సెక్షన్ 30 అమలులో ఉంటే దీక్ష శిబిరాలు ఎలా పెడతారని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. డీజీపీ తక్షణం దీక్ష శిబిరాలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని ఉల్లంఘించానని తనపై కేసులు పెట్టారని.. అదే చట్టం టీడీపీ వాళ్లకు వర్తించదా? అని ఆళ్ల ప్రశ్నించారు.

దీక్షలో 10, 20 శాతం మందే రైతులు ఉన్నారని..మిగిలిన వారంతా టీడీపీ అధినేత చంద్రబాబు బినామీలు.. ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసిన వ్యక్తులేనని ఆరోపించారు. దీక్షా శిబిరాల్లోకి చంద్రబాబు అసాంఘిక శక్తులను పంపారన్నారు. రైతులు నమ్మి భూములిస్తే చంద్రబాబు ద్రోహం చేశారన్నారు. టీడీపీ నేతలు రైతులను రెచ్చగొడుతున్నారని ఆళ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఉచ్చులో ఎవరూ పడవద్దని.. ఐదేళ్లుగా చంద్రబాబు చేసిన మోసానికి రైతులు బలయ్యారన్నారు. రైతులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అమరావతిలో రాజధాని వద్దని చెప్పినా చంద్రబాబు పెడచెవినపెట్టారన్నారు. మూడు పంటలు పండే భూముల్లో బాబు రాజధాని పెట్టారని ఆళ్ల విమర్శించారు. అన్యాయం చేసిన చంద్రబాబు రైతులను మళ్లీ దీక్షా శిబిరాల్లో కూర్చొబెడితే..వారిని రెచ్చగొట్టేందుకు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను పరామర్శించేందుకు పంపిస్తున్నారని విమర్శించారు. సమాజం మీద విపరీత ధోరణలు ఉండే విధంగా టీడీపీ నేతల ప్రసంగాలు ఉంటున్నాయని తెలిపారు. తాము చట్టాన్ని ఉల్లంఘించానని అరెస్టు చేసి కేసు పెట్టారని...కానీ 25 రోజులుగా అనేక రకాలుగా ఆందోళనలు చేస్తున్నారని.. జరుగనివి...జరిగినట్లుగా దేశంలో మిలిగిన చోట్ల జరిగిన సంఘనలను పోలీసులే చేయించినట్లుగా చిత్రీకరిస్తే పోలీసులు ఎందుకు సైలెంట్ ఉన్నారని ప్రశ్నించారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అంటారని... అమరావతిలో శిబిరాలు ఎలా పెడతారని ప్రశ్నించారు. ఇదిలావుంటే టీడీపీ అధినేత చంద్రబాబుపై వైసీపీ నేత ఆర్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఎందుకు జోలె పట్టుకుని తిరుగుతున్నారో చెప్పాలన్నారు. చంద్రబాబుగానీ ఆయన కుమారుడు లోకేష్ గానీ రైతుల కోసం ఒక్క రూపాయన్నా ఇచ్చారా అని ప్రశ్నించారు. మీడియాతో మాట్లాడుతూ బినామీల ఆస్తులు కాపాడేందుకే చంద్రబాబు జోలె పట్టారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రైతుల దగ్గర ఎందుకు దోచుకోవడమని నిలదీశారు. పోలీసులను ఇష్టం వచ్చినట్లు అంటారా అని అన్నారు. మూడు రాజధానులపై ఇంకా ప్రకటన రాలేదన్నారు. చంద్రబాబు ముందే ఊహించుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని విమర్శించారు. సెక్షన్ 30, సెక్షన్ 144 సెక్షన్ ఉండగా శిబిరాలు పెట్టకూడదన్నారు. అమరావతిలో నిర్వహిస్తున్న దీక్ష శిబిరాలను తక్షణం ఎత్తివేయాలని డీజీపీని కోరారు. తాము చట్టాలను ఉల్లంఘించామని తనను, రైతన్నలను పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. చట్టాలను గౌరవించామని, పోలీస్ స్టేషన్ కు వెళ్లి కేసులు పెట్టించుకున్నామని తెలిపారు. తాము చట్టాన్ని ఉల్లంఘించామని కాబట్టి తమపై పోలీసులు కేసు పెట్టారని పేర్కొన్నారు. అవే చట్టాలు టీడీపీకి వర్తించవా అని అడిగారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాలను తొలగించాలని అన్నారు. దీక్ష శిబిరాల ముసుగులో రైతన్నలు 10 నుంచి 20 శాతం మందే ఉన్నారని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, చంద్రబాబు బినామీలు, ఇన్ సైడర్ ట్రేడింగ్ చేసిన వ్యక్తులు, పక్కా జిల్లాల నుంచి టీడీపీ కార్యకర్తలతోపాటు అంసాంఘీక శక్తులను ప్రవేశపెట్టి ప్రజా ప్రతినిధులపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు.

అమరావతిలోని నిజమైన రైతులకు..న్యాయం జరుగుతుంది

- జిల్లాల వారిగా అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించాం

- జనవరి 15లోపు రైతులు అభిప్రాయాలను ప్రభుత్వానికి అందించొచ్చు

- 17న మరోసారి హై పవర్ కమిటీ భేటీ ఉంటుంది

- కమిటీ భేటీపై వివరాలు వెల్లడించిన మంత్రి పేర్ని నాని

విజయవాడ, జనవరి13(ఆర్ఎన్ఎ) : అమరావతిలోని నిజమైన రైతులకు న్యాయం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పేర్ని నాని అన్నారు. సోమవారం రాష్ట్రంలో పరిపాలన వికేంద్రీకరణ, సమగ్రాభివృద్ధిపై చర్చించేందుకు భేటీ అయిన హై పవర్ కమిటీ సమావేశం ముగిసింది

. అనంతరం మంత్రి పేర్ని నాని భేటీ వివరాలను విలేకరు ల ముందు వెల్లడించారు. జిల్లాల వారిగా అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. అలాగే రాజధానిపై జీఎన్ రావు నేతృత్వంలోని నిపుణుల కమిటీ సిఫార్సులు, బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) నివేదికపై కూడా చర్చ జరిపినట్లు మంత్రి తెలిపారు. రాజధాని రైతుల సమస్యలను సీఆర్డీఏ కమిషనర్‌కు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వానికి ఏమి చెప్పదలచుకున్నారో జనవరి 15లోపు రాత పూర్వకంగా లేదా ఈ-మెయిల్ ద్వారా వారి దృష్టికి తీసుకెళ్లొచ్చని సూచించారు. ఎవరైతే రాజకీయం కోసం ఈ అంశాన్ని వాడుకుంటున్నారో.. వారికి తప్ప అందరికీ న్యాయం జరగబోతుంది. రైతులతో పాటు రాజకీయంగా ప్రేరేపితం చేసిన వారు ప్రీ ప్లాన్డ్ గా కొంతమంది ఆందోళన చెస్తున్నారు.

వీటి వెనకాల టీడీపీ నేతలు ఉన్నారు. రైతులు కూడా మంత్రులను వ్యక్తిగతంగా కలుస్తున్నారు. వారి వినతులు కూడా చెప్తున్నారు. వాటన్నింటినీ స్వీకరిస్తామని అన్నారు. అలాగే ఈనెల 17న మరోసారి కమిటీ భేటీ అవుతుందని మంత్రి పేర్నినాని తెలిపారు.

ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు సినిమాల్లో బ్రహ్మానందంలా తయారయ్యారని వ్యవసాయ శాఖ కన్నబాబు విమర్శించారు. ఆయనకి బాధ కలిగితే వండుగ చేసుకోకూడదు, ఆనందం కలిగితే పండగ చేసుకోవాలా అని ప్రశ్నించారు.

అసత్యాలతో పండగపూటైనా వాళ్ళని ప్రేరేపించకుండా ఉంటే చాలని, సాక్షాత్తు రాష్ట్ర డీజీపీ ని కూడా విమర్శిస్తున్నారు మండిపడ్డారు.

యువతిపై క్యాబ్ డ్రైవర్ అత్యాచార యత్నం

స్థానికులు అడ్డుకోవడంతో పరార్

రంగారెడ్డి,జనవరి13(ఆర్ఎన్ఎ): ఎయిర్ లైన్స్ ఉద్యోగినిపై లైంగిక దాడి జరిగిన సంఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎయిర్ పోర్టులో ఓ యువతి విధులు నిర్వహించుకొని గత రాత్రి ఇంటికి వెళుతున్నప్పుడు శంషాబాద్ బస్టాండ్‌లో నిలబడింది. బస్సు రాకపోవ డంతో క్యాబ్‌లో వెళ్లింది.

మార్గమధ్యంలో క్యాబ్ డ్రైవర్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. డోర్ లాక్ చేసి ఆమెపై అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడు. వాహనదారులు అప్రమత్తం కావడంతో క్యాబ్ డ్రైవర్ పారిపోయాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నిప్రాంతాల అభివృద్ధే జగన్ ప్రయత్నం

- ముంబై, చెన్నై తరహాలో అభివృద్ధి చెందే అవకాశం విశాఖకే ఉంది

- విశాఖపై చంద్రబాబు విషం కక్కుతున్నారు

- వైసీపీ నేత దాడి వీరభద్రరావు

విశాఖపట్టణం, జనవరి13(ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం జగన్మోహన్ రెడ్డి ఉద్దేశమని, అందుకే మూడు రాజధానులతో వైకాపా ప్రభుత్వం వినూత్న రీతిలో ముందుకెళ్లుందుకు ప్రయత్నిస్తుందని వైసీపీ నేత దాడి వీరభద్రరావు ధ్వజమెత్తారు. విశాఖపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ ప్రజలపై ప్రతిపక్ష నేత చంద్రబాబు విషం కక్కుతున్నారని మండిపడ్డారు. అన్నిప్రాంతాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తోంటే.. చంద్రబాబు విషపూరితం చేస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని ఆయన ఎప్పుడైనా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. సీఎం జగన్ తీసుకుంటున్న నిర్ణయాలతో తాము అభివృద్ధి చెందుతామన్న భావన ఉత్తరాంధ్ర ప్రజల్లో కలుగుతుందన్నారు. పరిపాలనా రాజధానిగా సేవలందించేందుకు విశాఖకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని చెప్పారు. ముంబై, చెన్నై తరహాలో అభివృద్ధి చెందే అవకాశం విశాఖకే ఉందన్నారు. నాలుగు రకాల రవాణా మార్గాలు విశాఖకు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఐఐటీ నిపుణులు కూడా అమరావతిలో భారీ నిర్మాణాలు సరికాదని చెప్పారని వివరించారు.

అడిగినా ఇవ్వని నాయకుడు చంద్రబాబు అయితే.. అడగకుండానే ఇచ్చే నాయకుడు వైఎస్ జగన్ అని వీరభద్రరావు పేర్కొన్నారు. మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నదే వైఎస్ జగన్ ఆలోచన అని చెప్పారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు ఆయనపై పోటీ చేస్తానని చెప్పిన చంద్రబాబు.. పార్టీ ఓడిపోవడంతో పదవి కోసం ఎన్టీఆర్ చుట్టు తిరిగారని విమర్శించారు. కూతురు కోసం చంద్రబాబును పార్టీలోకి తీసుకుని చివరికి అతని చేతిలోనే ఎన్టీఆర్ మోసపోయారని తెలిపారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నలపై అభ్యంతరం

భోపాల్,జనవరి13(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షలో భిల్ తెగకు చెందినవారిని కించపర్చారని పంధానా బీజేపీ ఎమ్మెల్యే రామ్ డంగోరే ఆరోపించారు. పరీక్షా పత్రంలో భిల్ తెగకు చెందినవారిని నేరపూరిత ప్రవర్తన కలిగిన వారిగా, అనైతికమైన వారిగా పేర్కొన్నారు. ఇలాంటి పనులతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయాలనుకుంటుందని ఎమ్మెల్యే రామ్ డంగోరే ప్రశ్నించారు. ఇలాంటి ప్రశ్నాపత్రం తయారు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాజస్థాన్ కు చెందిన ప్రధానమైన తెగ భిల్. దుంగార్ పూర్ , బన్స్ వారా, ఉదయ్ పూర్ లోని సిరోహి ప్రాంతాలతోపాటు మధ్యప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ లో కూడా కనిపిస్తుంటారు.

బాబులాంటి అవకాశవాది..

ఎక్కడా కనిపించడు

- ట్విటర్‌లో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

అమరావతి, జనవరి13(ఆర్ఎన్ఎ) : ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుపై వైసీపీ జాతీయ కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి ట్విటర్ లో తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు లాంటి అవకాశవాది ఎక్కడా కనిపించడని అన్నాడు. తన స్వార్థం కోసం, బినామీల కోసం అందరూ వీధుల్లోకి రావాలట.. నేను పోరాటం చేస్తుంటే విద్యార్థులు ఇళ్లలో కూర్చుంటారా అని ప్రశ్నిస్తున్నాడు. ఇప్పుడేమో ఉద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఈయన ఆస్తుల ధర పడిపోకుండా అంతా అడ్డం నిల్చోవాలట అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సంక్రాంతి పండగను సొంత ఊళ్లలో జరుపునే సంప్రదాయం తమ కుటుంబంతోనే మొదలైందని అప్పట్లో ప్రవచించాడని అన్నారు. 'ఇన్ సైడర్' కిరికిరిలో దొరికిపోయి ఈసారి పండగ బహిష్కరిస్తున్నాడట.. ప్రజలు కూడా తనను అనుసరించాలనేది ఆయన ఆకాంక్ష విధించాడు. అసలు అలా అనడానికి చంద్రబాబు ఎవరు అంటూ ప్రశ్నించారు. సంక్రాంతి పండుగ ఎవరూ జరుపుకోవద్దని అనడం సిగ్గుచేటని, అసలు చంద్రబాబు ఆయన్ను ఆయన ఏం ఊహించుకుంటున్నాడో ప్రజలకు అంతపట్టడం లేదని విమర్శించారు. గ్రామాల్లో మాత్రం ఎన్నడూ లేనంత సంక్రాంతి శోభ కనిపిస్తోందని విజయసాయిరెడ్డి అన్నారు. ప్రజలంతా సంతోషంగా సంక్రాంతి పర్వదినాన్ని జరుపుకుంటున్నారని, చంద్రబాబు తీరును విమర్శలు గుప్పిస్తున్నారని అన్నారు.

రామకృష్ణారెడ్డి రాజీనామా చేసి మళ్లీ పోటీచేయ్

- లోకేశ్ గెలిస్తే అమరావతిని ఇక్కడే ఉంచండి

- మీకు మంగళగిరి ప్రజలు ఎక్కువా? జగన్ ఎక్కువా?

- టీడీపీ నేత బుద్దా వెంకన్న

అమరావతి, జనవరి13(ఆర్ఎన్ఎ) : రామకృష్ణారెడ్డి రాజీనామా చేసి మళ్లీ పోటీచేయ్.. లోకేశ్ గెలిస్తే అమరావతిని అక్కడే ఉంచండి.. దీనికి సిద్ధమేనా అంటూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డికి టీడీపీ నేత బుద్దా వెంకన్న సవాల్ విసిరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రామకృష్ణారెడ్డి ర్యాలీ చేపట్టడంపై విమర్శలు గుప్పించారు. ఆర్కేకి మంగళగిరి ప్రజలు ఎక్కువా? జగన్ ఎక్కువా? అంటూ ప్రశ్నించారు. జగన్ మెప్పుకోసం ఇటువంటి పనులు చేద్దామనుకుంటున్నారన్నారు. ఇది కుదరదని, జగన్ ముఖ్యమా? ఓట్లేసి గెలిపించిన ప్రజలు ముఖ్యమా? అని ప్రశ్నించారు. రైతులు ఉద్యమాలు చేస్తుంటే వారిని హేళన చేస్తూ మాట్లాడుతున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి ఎమ్మెల్యేలను ఎక్కడా చూడలేదన్నారు. కోతికి కొబ్బరి కాయ దొరికినట్లు ఉందని, ప్రజలకు మంచి చేయాలని వీళ్లకు లేదని బుద్దా వెంకన్న అన్నారు. మంగళగిరిలో భద్రత సిబ్బంది లేకుండా మీరు రోడ్లపైకి వస్తే ప్రజలే మీకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మంగళగిరిలో లోకేశ్ బాబు మళ్లీ పోటీ చేస్తారని, లోకేశ్ గెలిస్తే అమరావతిని ఇక్కడే ఉంచండి.. ఈ సవాలుకి ఒప్పుకుంటారా.. అని ప్రశ్నించారు. నాటకాలు ఆడొద్దని, మా సవాలును స్వీకరించాలని బుద్దా వెంకన్న అన్నారు. మా సవాలు స్వీకరిస్తే ప్రజలు మీకు వ్యతిరేకంగా ఉన్నారో, సానుకూలంగా ఉన్నారో తెలిసిపోతుందని బుద్దా పేర్కొన్నారు. ఆర్కే సొంతంగా నిర్ణయాలు తీసుకోలేరని, ఆయనొక బొమ్మలాంటి వారని అన్నారు. జగన్ వెనుక ఉండి నడిపిస్తున్నారని బుద్దా వెంకన్న చెప్పారు. జగన్ దెబ్బకి ఏపీ వారు తెలంగాణకు వెళ్తున్నారని, సంక్రాంతి రోజైనా అమరావతి రాజధానిపై మనసు మార్చుకోవాలని బుద్దా వెంకన్న విమర్శించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

కృష్ణా జిల్లాలోనూ పందాల జోరు

విజయవాడ,జనవరి13(ఆర్ఎన్ఎ): సంక్రాంతి పండుగ సందర్భంగా కృష్ణా జిల్లాలో కోడి పందేలు జోరుగా సాగనున్నాయి. గతేడాది లాగే ఈ యేడు కూడా పందాలకు సిద్ధం అవుతున్నారు. గుడివాడ, పామర్రు నియోజకవర్గాల్లో పెద్దయెత్తున పందేలు నిర్వహిస్తున్నారు. స్థానిక నేతలే పందాలను ప్రోత్సహిస్తున్నారని సమాచారం. గుడ్లవల్లేరు, కొమరవోలు, ముప్వ మండలాల్లో కోడిపందేలు ఏటా జోరుగా కొనసాగుతాయి. అలాగే విజయవాడ తూర్పు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో జోరుగా కోడిపందేలు జరగుతాయి. దీంతో ఎక్కడ చూసినా జనసందోహమే కనబడుతోంది. కోడి పందేలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆ గ్రామాల్లో ఎటుచూసినా పండుగ వాతావరణమే కనిపిస్తోంది.

యువతరంలో స్ఫూర్తి కోసం హార్దిక్ పాండ్యాతో మాన్‌స్టర్ ఎనర్జీ జట్టు

హైదరాబాద్, జనవరి 13: గ్లోబల్ ఎనర్జీ డ్రింక్స్ బ్రాండ్ మాన్‌స్టర్ ఎనర్జీ టీమ్ ఇండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నది. భారతదేశానికి తమ సంస్థకు నూతన బ్రాండ్ అంబాసిడార్‌గా ఉంటారని తెలిపింది. మైదానంలో క్రికెట్ ఆడుతున్నప్పుడు దూకుడు ఆటతీరుకు మారుపేరుగా నిలిచిన హార్దిక్ పాండ్యా ఆఫ్‌ఫీల్డ్‌లో శాంతియుత మనస్తత్వానికి పెట్టింది పేరు. హరేన్ పాండ్యా భాగస్వామ్యంతో యువ భారతంలో మరింత శక్తిమంతంగా, ఆత్మవిశ్వాసం పెంపొందించనున్నది మాన్‌స్టర్ ఎనర్జీ. ఈ సంస్థ ప్రచారకర్తగా మాన్ స్టర్ ఎనర్జీతో ఒప్పందం కుదుర్చుకున్న తొలి అథ్లెట్ హరేన్ పాండ్యా. మాన్ స్టర్ ఎనర్జీ ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఆటగాళ్లతో జత కట్టడం ద్వారా యువతరాన్ని మోటార్ స్పోర్ట్స్, యాక్షన్ స్పోర్ట్స్ పట్ల ఆకర్షితులను చేస్తోంది. అల్టిమేట్ ఫైటింగ్ చాంపియన్ షిప్ సూపర్ స్టార్ కూనర్ మైక గ్రేగర్, మోటో జీబీ లెజెండ్ వాలెంటినో రోసి, 6ఎక్స్ ఫార్ములా వన్ చాంపియన్ లూయిస్ హామిల్టన్, 6ఎక్స్ ఎక్స్-గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ జాక్సన్ స్ట్రాంగ్ తదితరులు మాన్ స్టర్ ఎనర్జీతో జత కట్టారు. హార్దిక్ పాండ్యా దీనిపై స్పందిస్తూ మాన్ స్టర్ కుటుంబంలో భాగస్వామి అయినందుకు తనకు గర్వంగా, ఆనందంగా ఉందన్నారు. ప్రతి రోజూ అదే ఉత్సాహం, నిర్భయత్వం, శక్తితో యువతరంలో స్ఫూర్తిని పెంపొందిస్తామని అన్నారు. మాన్ స్టర్ ఎనర్జీ ఆసియా మార్కెటింగ్ సీనియర్ డైరెక్టర్ జాన్ లుడెకె మాట్లాడుతూ హార్దిక్ పాండ్యా వంటి సూపర్ చార్జిడ్ వ్యక్తిత్వం గల అథ్లెట్ భాగస్వామ్యంతో మాన్‌స్టర్ ఎనర్జీ నైతిక విలువలను మరింత బలోపేతం చేసిందన్నారు. నిర్భయత్వంతో, దూకుడు శైలి మాన్ స్టర్ ఎనర్జీ బ్రాండ్ గొప్ప ఫిట్ నెస్ అని వ్యాఖ్యానించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.